76809 94755 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2016-18




# రాజధాని వార్తలు

Voice of Voiceless




అమరావతి సంపుటి : 3 సంచిక 52, పేజీలు 4 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ ' రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 17 - ఆదివారం 23 సెప్టెంబర్, 2018

వివరాలు 2లో...

ప్రభుత్వ నిర్లిప్తత + అధికారుల అలసత్వం = 62 ప్రాణాలు

వివరాలు 3లో...

ఫైటర్ బామ్మ మీనాక్షి రాఘువన్

వివరాలు 4లో...

ప్రపంచంలో పెరుగుతున్న పేదరికం

వివరాలు 4లో...

ఘనంగా ఉభయ రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు



# ముస్లింలలో చీలిక ?

**అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండగా రాజకీయపార్టీలు ఓటర్లను ఆకట్టుకోవడం కోసం నానా తంటాలు పడుతున్నాయి. అదే సమయంలో తమకు అనుకూలంగా లేని వర్గాల్లో విభేదాలు సృష్టించడం లేదంటే ఓట్లు చీల్చడానికి ఎన్నో కుట్రలు, కుయుక్తులు పన్నుతున్నాయి. ముస్లిం సోదరులు ఈ విషయంలో జాగరూకతతో వ్యవహరించాల్సి ఉంది.**


- పావులు కదుపుతున్న అధికారపార్టీ
- అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కుట్ర
- జిల్లాకు చెందిన 'నవాబుల' విద్యాలయంతో ప్రణాళికలు?

**రాజధాని వార్తలు డెస్క్, విజయవాడ :** ముస్లింలు ఐక్యమత్యంగా సామాజికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా, రాజకీయ రంగాలలో అభివృద్ధి చెందాలంటూ వారిని విడదీసే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. అందులో భాగంగానే ఇటీవల విజయవాడలోని బసవపున్నయ్య హాల్లో 'నవ్యాంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ముస్లింల పాత్ర 'అనే అంశంపై చర్చించారు. రాష్ట్రంలోని ముస్లిం ఓటర్లు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో 25 మంది ముస్లిం మైనార్టీలు స్వతంత్ర్య అభ్యర్థులుగా పోటీ చేస్తారని

- మిగతా 2 లో

# రాజకీయ అస్త్రంగా చంద్రబాబు అరెస్ట్ వారెంట్

- సన్నద్ధమైన తెదేపా
- కేంద్రంపై పోరు జోరును ముమ్మరం చేయనున్న ముఖ్యమంత్రి





**రాజధాని వార్తలు, అమరావతి :** ప్రత్యేక హోదా ధర్మ పోరాటంతో ఎన్డీయే ప్రభుత్వంపైన ప్రధాని మోదీ, భాజపాపైనా ఉద్యమం సాగిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు 8 ఏళ్ల కిందటి బాబ్లి కేసులో మహారాష్ట్ర కోర్డు నాన్‌బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేయడం అధికార పక్షానికి మరోక అవకాశం ఇచ్చింది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా అంశంతో ఎన్డీయే నుంచి వైదొలిగి ప్రధాని నరేంద్రమోదీ భాజపాలపై చంద్రబాబు రాజకీయ పోరును ఉధృతం చేసిన విషయం తెలిసిందే. రానున్న ఎన్నికలలో ఈ అంశం ఓటర్లను ఆకట్టుకొనడానికి ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి విశ్వసించారు. వచ్చే సంవత్సరం మొదట్లో రానున్న ఎన్నికలకు ప్రత్యక్ష ఎన్నికల ప్రచారం ప్రారంభించే ముందు ధర్మ పోరాటంపై భారీ భహిరంగ సభ ఏర్పాటుకు తెదేపా పథకాలను సిద్ధం చేస్తుంది. ఈ సమయంలో సీఎం చంద్రబాబు నాయుడు దూకుడుకు కళ్లెం వేయడానికి కేంద్ర ప్రభుత్వం సంస్థలను రంగంలోకి దించడానికి భాజపా పథకాలను సిద్ధం చేసిందనే వార్తలు వచ్చాయి. చంద్రబాబును ఇరుకునపెట్టి రాష్ట్రంలో అనిశ్చిత పరిస్థిలను సృష్టించడానికి భాజపా ఏక్షణంలోనైనా చంద్రబాబుపై చర్యలు ప్రారంభిస్తుందని గడిచిన వారంలో రాజకీయ వర్గాలో చర్చను ప్రారంభించాయి. ఇదే సమయంలో చంద్రబాబుకు మహారాష్ట్ర కోర్టు అరెస్ట్ వారెంటు జారీ చేయడం రాజకీయాలను వేడెక్కించింది. చంద్రబాబుపై కక్ష సాధింపు చర్యలలో ఈ చర్యలు ఓ భాగమని తెదేపా నాయకులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. బాబ్లీ ప్రాజెక్టు ఆందోళన సమయంలో చంద్రబాబు బందంలో 16 మందిపై పెట్టిన కేసుల విచారణకు ఎన్ని నోటీసులిచ్చిన స్పందించకపోవడమే చంద్రబాబు నోటీసుకు కారణమని ఇది కక్ష సాధింపు చర్య కాకపోగా భాజపా నాయకత్వానికి ఏమాత్రం ప్రమేయంలేదని భాజపా నాయకులు వివరణలు ఇచ్చినా తెదేపా విమర్శలు ఆగడంలేదు. బాబ్లీ సంఘటన తెలంగాణ ప్రాంతానికి

- మిగతా 3 లో

## నేటి రాత్రి పీఎస్ఎల్‌వీ సీ42 ప్రయోగం




**శ్రీహరికోట :** భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ (ఇస్రో)సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లోని మొదటి ప్రయోగవేదిక (షార్) నుంచి ఆదివారం రాత్రి 10.07 గంటలకు పీఎస్ఎల్‌వీ సీ42 ఉపగ్రహ వాహకనౌకకు శనివారం మధ్యాహ్నం 1.07 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభమవుతుందని మిషన్ సంసిద్ధతా సమావేశం (ఎంఆర్‌ఆర్)లో అధికారికంగా ప్రకటించారు. షార్ కేంద్రంలోని బ్రహ్మప్రకాష్ హాల్‌లో ఎంఆర్‌ఆర్ కమిటీ చైర్మన్ కాటూరి నారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి మిషన్ సంసిద్ధతా సమావేశాలు నిర్వహించారు.లాంచ్ ఆథరైజేషన్ బోర్డు చైర్మన్ ఎస్.పాండ్యన్ ఆధ్వర్యంలో ప్రయోగానికి 33 గంటల ముందు శనివారం మధ్యాహ్నం 1.07 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించాలని నిర్ణయించారు. పీఎస్ఎల్‌వీ సీ42 ద్వారా యునైటెడ్ కింగ్‌డం (బ్రిటన్)కు చెందిన 889 కిలోల బరువు కలిగిన నోవాసార్, ఎస్1 అనే రెండు ఉపగ్రహాలను రోదసీలోకి పంపేందుకు సిద్ధం చేశారు.

# ఈ కేసును పరిశీలించి సలహా లివ్వండి

**రాజధాని వార్తలు,అమరావతి :** మహారాష్ట్ర ధర్మాబాద్ కోర్టు బాబ్లీ ప్రాజెక్ట్ కేసు విషయమై జారీచేసిన అరెస్ట్ వారెంట్ పూర్వాపరాలను పరిశీలించి సలహా ఇవ్వాల్సిందిగా న్యాయ నిపుణులను ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. గతంలో కేసును కొట్టివేసినట్లు వెబ్‌సైట్‌లో చూపడం...ఆ తర్వాత పలు సెక్షన్ల కేసు నమోదు చేయడం...నోటీసులు ఇవ్వకపోవడం హఠాత్తుగా నాన్ బెయిలబుల్ అరెస్ట్‌వారెంట్ జారీ చేయడం తదితర అంశాలను న్యాయనిపుణులకు తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు తదుపరి కార్యాచరణపై వారి సలహా అడిగారని తెలుస్తోంది. మరోవైపు ఈ కేసులో చంద్రబాబుతో పాటుగా నోటీసులు అందుకున్న ఎమ్మెల్యేలు, కేబినెట్ సహచరులతో కూడా చంద్రబాబు ఈ విషయమై చర్చించనున్నట్లు సమాచారం. ఇదిలావుంటే ఐక్యరాజ్యసమితి సదస్సులో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 23న అమెరికా వెళ్లాల్సివుండగా

### న్యాయనిపుణులను కోరిన సీఎం చంద్రబాబు

అందుకు ఈ కేసు ప్రతిబంధకమవుతుందా అనే అంశాన్ని సీఎంవో అధికారులు లోతుగా పరిశీలిస్తున్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడే ఈ ప్రాజెక్ట్ కు టెండర్లు పిలిచిన విషయం గమనించాలని, అయితే ఆ తరువాత మళ్లీ ఆయనే ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఉద్యమం అంటూ బాబ్లీ ప్రాజెక్ట్ వద్దకు వెళ్లాడని విపక్షాలు వివరిస్తున్నారు. ఈ క్రమంలో బాబ్లీ వద్దకు మీడియా సైతం రాకుండా ఆంక్షలు పెట్టిన మహారాష్ట్ర ప్రభుత్వం ఆ క్రమంలో టీడీపీ నాయకులు ఉద్యమం అంటూ రాగానే అదుపులోకి తీసుకున్నారని, ఆ తరువాత ఒక విమానంలో తీసుకొచ్చి ఏపీలో వదిలేసి వెళ్లారని వారు చెబుతున్నారు. మహారాష్ట్ర పోలీసులు వీళ్లను అదుపులోకి తీసుకున్న సమయంలో ఈ ఉద్యమ నేతలు పోలీసులపై చేసిన హడావుడి, ప్రభుత్వ ఉద్యోగులపై దాడికి ప్రయత్నించడంతో 5 ఏళ్ల క్రితం పోలీసులు ఈ కేసుపై చార్జిషీటు కూడా వేశారంటున్నారు. ఆ క్రమంలో చంద్రబాబు అండ్ కో కు అనేకసార్లు వారెంట్లు జారీ అయ్యాయని, అలా నోటీసులు అందుకున్న వారిలో తెరాస నేతలు కూడా ఉన్నారని చెబుతున్నారు. కోర్టుకు హాజరుకానందుకు వీరికి అరెస్ట్ వారీ జారీ కానుందనే విషయం ఒక స్థానిక మీడియా ద్వారా తెలుసుకొని దాన్ని రాజకీయ లబ్ధికి వాడుకునేందుకు టీడీపీ పక్కా ప్రణాళిక రచించిందని, ఎన్నో అతి పెద్ద కేసుల్లోనే స్టేలు తెచ్చుకున్న చంద్రబాబుకు ఈ కేసు నిజానికి ఒక లెక్కే కాదని, ఈ కేసును ఎన్నికలకు ఉపయోగించుకునేందుకే ఈ రచ్చంతా అని ప్రత్యర్థులు తేల్చేస్తున్నారు. ఏదేమైనా తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా జాతీయ స్థాయిలో సంచలనం సృష్టిస్తున్న ఈ కేసు పర్యవసానాలు ఎలా పరిణమిస్తాయనేది వేచిచూడాలి.

# ప్రజా సమస్యలకు కాదు రాజకీయాలకు వేదికగా చట్ట సభలు


**రాజధాని వార్తలు, అమరావతి :** ఎన్నికల సంవత్సరంలో తప్ప రాజకీయ ప్రయోజనాలు కాక ప్రజల సమస్యలు చర్చించి కొన్ని విభేదాలు ఉన్నా పరిష్కార మార్గాలు కనుగొనే వేదికగా చట్టసభలు పనిచేసే రోజులు పోయాయి. ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుక్షణం నుంచే ప్రత్యర్థులుపై దాడులు ప్రారంభించే రాజకీయ సంస్కృతి ప్రారంభమయింది. రాజకీయాలను వ్యాపారంగా మార్చి విజయం కోసం కోట్ల రూపాయిలు కుమ్మరిస్తున్న నాయకులు ఎన్నికల్లో ఓడిపోతే కనీసం మూడు సంవత్సరాలైనా రాజకీయ ప్రయోజనాలకు దూరంగా ఉండలేకపోతున్నారు. ఏదోవిధంగా ప్రభుత్వం పడిపోయి ఎన్నికలు రావలని కోరుకుటున్నారు. ప్రతిపక్షం పరిస్థితి ఇలా ఉండగా అధికార పక్షమూ చట్టసభలకు ప్రాధాన్యత ఇవ్వట్లేదు. రాజ్యాంగం ప్రకారం కొద్దీ రోజులు తూతూమంత్రంగా చట్టసభ నిర్వహిస్తే చాలు అనుకుంటున్నారు. కనీసం సంవత్సరంలో నూరు రోజులు చట్టసభలు నిర్వహించాలనే ప్రయత్నమే అధికార పక్షం చేయటం లేదు. ప్రజా సమస్యలపై అన్ని పక్షాల అభిప్రాయాలు తెలుసుకొని పరిష్కార మార్గాలను ఆలోచించే ప్రయత్నం ప్రభుత్వ పక్షం చేయటం లేదు. ప్రభుత్వం పై ముఖ్యంగా అధికార పక్ష నాయకులపై అవినీతి ఆరోపణలు చేయటం, సభలో గందరగోళం సృష్టించి సభను నడవకుండా చేయడానికే ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయి. తాము తీసుకువచ్చే శాసనాలకు రాజ్యాంగ పరంగా ఆమోదం పొందితే చాలు అనే పద్ధతిలో అధికార పక్ష నాయకులు ఉన్నారు. చట్ట సభలను నిర్వహించే వ్యవస్థలూ అంతఅంత మాత్రంగానే ఉన్నాయి, అధికార పక్ష నాయకుని అనుగ్రహంతో ఎన్నికవుతున్న (నిజానికి ఇది ఎన్నిక కాదు. నామినేషన్ మాత్రమే) సభాపతులు ప్రభుత్వానికి ప్రభుత్వ నాయకునికి అండగా వ్యవహరిస్తున్నారు. ఏ పార్టీ నుంచి ఎన్నికైనా సభాపతిగా ఎన్నికైన తరువాత రాజకీయాలకు అతీతంగా వ్యవహరించే సంప్రదాయానికి తిలోదాకాలు ఇచ్చారు. చట్టసభ నిర్వహణలో ప్రజాధనం దుర్వినియోగం కావటం తప్ప ప్రజలకు ఉపయోగం లేకుండా పోయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయిన తరువాత ఏర్పడిన తొలి శాసనసభ నడిచిన తీరు బాధకరం. తమ అతి విశ్వాసం వల్ల ఎన్నికల్లో ఓడిపోయామని నమ్మిన ప్రతిపక్ష నాయకుడు ఎన్నికైన పక్షంగా అధికార పక్షాన్ని చూడడానికి ఇష్టపడలేదు. శాసనసభ సమావేశాలు జరిగే అవకాశమే లేకుండా పోయింది. సభకు హాజరైన

- మిగతా 2 లో

## ఈవారం రాజధాని

- అమరావతిలో 10 ఎకరాల్లో ప్రపంచ స్థాయి ప్రమాణాలతోవక్ఫ్‌బోర్డ్ ఆధ్వర్యంలో మసీదు నిర్మాణం
- వెంకటపాలెం మూడున్నర ఎకరాల్లో హెల్త్ అండ్ రిక్రీమేషన్ రిసార్ట్ నిర్మాణం చేపట్టనున్న మురళీ ఫార్చ్యూన్ గ్రూప్
- అమరావతి కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి ముందుకొచ్చిన వరుణ్ హాస్పటాలిటీ
- వ్యవసాయ ఉత్పత్తుల ఆన్‌లైన్ అమ్మకాల కొరకు ఈ-రైతు వ్యవస్థను ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు.
- నిరుద్యోగభృతి పథకం 'యువనేస్తం' ను ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు.
- ప్రధాన పరిపాలన శాఖలో సమాచార పౌరసంబంధాల కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన బి.రామాంజనేయులు ఐ.ఏ.యస్.


## కాంగ్రెస్ వాళ్లు మొట్టికాయలతో సరిపెడితే... మోడీ తాత వాతలెడుతున్నాడు




# పెట్రోలు రేట్లు పైపైకి.. గ్రాఫ్ కిందికి

**పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాన్నంటుతున్నాయి. అయితే మోడీ ప్రభుత్వం తెలివి చూడండి. రూ.30 నుంచి 40కి అక్కడి నుంచి రూ.70కి పెరిగినప్పుడు ధరలు పైకి పెరిగినట్లు చూపిన గ్రాఫ్ రూ. 80 దాటే సరికి ధర తగ్గినట్లు గ్రాఫ్‌లో కిందికి చూపారు. ప్రస్తుతం రూ. 90 దాటుతోంది..అయితే రేట్లు మరింత తగ్గినట్లు కిందికి చూపుతారన్నమాటా చూడండి..మోడీ తెలివితేటలు...**

**ఆర్థిక రాజధాని ముంబయిలో శనివారం 28 పైసలు పెరిగి లీటర్ పెట్రోల్ ధర రూ.88.67కు పెరిగింది. ప్రతిరోజూ పెరుగుతున్న పెట్రో ధరలు మరికొన్ని రోజుల్లోనే 90 రూపాయలకు చేరుకోవడం ఖాయంగా కనిపిసోంది. ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర 81.28కు చేరుకోగా, చెన్నైలో రూ. 84.49, కోల్‌కతాలో రూ. 83.14, హైదరాబాద్‌లో రూ. 86.18గా ఉంది. మరోవైపు డీజిల్ ధర పెరిగింది. ఢిల్లీలో లీటర్ డీజిల్ ధర 22 పైసలు పెరిగి రూ.73.30గా నమోదైంది. ముంబయిలో రూ. 77.82, కోల్‌కతాలో రూ. 75.15, చెన్నైలో రూ. 77.49, హైదరాబాద్‌లో రూ. 79.73గా ఉంది.**



రాజధాని వార్తలు కలం

## పన్ను–పోటు

పాలకులు రెండు విధాలుగా ఉంటారు.. ఒకటి ప్రజా క్షేమం కాంక్షించేవారు. రెండు ప్రజలను పీడించేవారు. దురదృష్టవశాత్తు మన దేశంలోనూ, రాష్ట్రంలోనో రెండో వర్గమే ఉంది. దక్షిణ ఆసియాలో ఖండంలో భారతదేశంలో ఎక్కువ రేట్లు ఉండగా,దక్షిణాదిలో మనరాష్ట్రంలోనే అత్యధిక వ్యాట్‌ను పెట్రోలు, డీజిలుపై అమలు చేస్తున్నారు. వాస్తవానికి పెట్రోల్, డీజిల్ ధరల నిర్ణయంలో నాలుగు కీలకాంశాలు ఉంటాయి. 1.డీలరు ధర,2.కేంద్ర ఎక్సైజ్ సుంకం, 3.డీలర్ కమిషన్, 4.రాష్ట్రాలు అమలు చేసే వ్యాట్. డీలరు ధరను అంతర్జాతీయ ముడిచమురు ధరలు, రవాణా చార్జీలు, డాలరు మారక విలువ వంటి వన్నీ ఈ ధరను ప్రభావితం చేస్తాయి. సెంట్రల్ ఎక్సైజ్‌డ్యూటీ డీలర్ ధరపై నిర్ణీత మొత్తంగా దీన్ని అమలు చేస్తారు. మూడోది డీలర్ కమిషన్ డీజిల్ బంకులకు డీలర్లకు చమురు సంస్థలు కొంత కమీషన్ ఇస్తాయి. డీలర్ ఖర్చులు లాభాలకు సరిపడేలా ఈ కమీషన్ ఉంటుంది. ఇది వినియోగదారుడిపైనే పడుతుంది. చివరిగా రాష్ట్రాలు విధించే వ్యాట్ ఇది పెట్రోలు, డీజిల్ విక్రయాలపై సేల్స్‌ట్యాక్ అమలు చేస్తాయి. ఇది ఒక్కోరాష్ట్రం ఒక్కోపన్ను విధిస్తుంది. దీంతో రాష్ట్రాల మధ్య పెట్రోలు, డీజిల్ ధరల హెచ్చుతగ్గులుంటాయి.

దేశంలో అత్యధిక వ్యాట్ విధిస్తున్న రాష్ట్రాలుగా మహారాష్ట్ర–39.12 శాతం,ఆంధ్రప్రదేశ్ –38.11,మధ్యప్రదేశ్–35.78,పంజాబ్ –35.12, తెలంగాణ–33.31,తమిళనాడు–32.16,కర్ణాటక–30.28 శాతంగా ఉంది. దేశంలోనిన 21 రాష్ట్రాల్లో 25 కంటే ఎక్కువ పన్ను విధిస్తున్నారు. 2014 ఏప్రిల్‌లో పెట్రోల్‌పై ఎక్సయిజ్ సుంకం లీటరుకు రూ.9.48 గా ఉండగా 2017 అక్టోబరుకు అది 19.48 రూపాయలకు చేరింది. 2016 జనవరిలోనే రూ.21.48కి పెంచినా ఆ తరువాత రూ.2 తగ్గించారు.మోడీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి గత ఏడాది అక్టోబరు వరకు పరిశీలిస్తే ఎక్సయిజ్ సుంకం పెట్రోలుపై రెండింతలు.. డీజిలుపై అయిదింతలు అయింది. అత్యల్పంగా అండమాన్ నికోబార్ దీవుల్లో 6 శాతం పన్ను ఉంది.రాష్ట్రాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటే మిజోరాం అత్యంత తక్కువగా 11.44 శాతం పన్ను విధిస్తోంది.

ఈ ఆర్థిక సంవత్సరం(2018–19)లో ముడి చమురు ధర ఏప్రిల్‌లో సగటు 69.22 డాలర్లు ఉండగా మేలో 73.83, జూన్‌లో 73.47, ఆగస్ట్‌లో 72.53 డాలర్లు ఉంది. ముడి చమురు ధరలను2011–12లో గరిష్టంగా 111.89 డాలర్లు ఉండగా.. 2012 మార్చిలో అత్యధికంగా 123.16 డాలర్లగా ఉంది.అయితే అప్పటి ధర కేవలం లీటరు రూ.61 మాత్రమే...ప్రస్తుతం అంతర్జాతీయంగా ధరల పెరుగుదల లేనప్పటికీ రూపాయి విలువ తగ్గుతున్న కారణంగా పెట్రోలు ధరలను తగ్గించలేమని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 10న చేపట్టిన భారత్ బంద్‌తో రాజస్తాన్ ప్రభుత్వం రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నాలుగు శాతం వ్యాట్ తగ్గించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లీటరు పెట్రోలుపై రూ.2 తగ్గించింది కాని వ్యాట్‌ను మాత్రం తగ్గించలేదు. రాజస్తాన్‌లో పెట్రోల్ పై వ్యాట్ 30.80 శాతం మాత్రమే.. ఇప్పుడు 4 శాతం తగ్గింది. మనరాష్ట్రంలో లీటరు పెట్రోలు రూ. 87. 16 ఉండగా, రెండు రూపాయలు తగ్గిన తర్వాత రూ. 85. 16 చేరింది. యానాంలో రూ. 79. 47, ఒడిశాలో రూ. 79. 67, కర్ణాటకలో 83.46, తమిళనాడులో రూ.84గా ఉంది. అంటే దక్షిణ భారతంలో మనకే వ్యాట్ బాదుడు ఎక్కువన్న మాట.

అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు దారుణంగా పతనమయ్యాయి. ఇప్పటికీ నాలుగేళ్ళ క్రితం నాటి ధరలతో పోల్చిచూడలేని పరిస్థితి. ఆ లెక్కన, మనదేశంలో పెట్రోల్ ధర లీటర్‌కి 50 రూపాయలు దాటకూడదు. కానీ, ఓ వైపు కేంద్రం.. ఇంకోవైపు రాష్ట్రం.. వాహనదారుల్ని నిలువునా దోచేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు సర్కార్, 2 రూపాయల వ్యాట్ తగ్గిస్తే, ఖాజనా మీద పడేభారం 1120 కోట్ల రూపాయలు. ఇదొక్కటి చాలు.. పెట్రోల్, డీజిల్ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దోపిడీ ఏస్థాయిలో వుందో చెప్పడానికి.



సెల్ ఫోన్ పిచ్చి ఎలా ఉందో చూడండి

## విట్‌లో జీఎస్టీపై సదస్సు

**రాజధాని వార్తలు, అమరావతి :** దేశంలో పన్ను మీద పన్ను భారం పడటంతో వస్తువులు, సేవలు ధరలు అమాంతం పెరగటం చూసామని అందుకే వస్తు – సేవల పన్ను (జి.ఎస్.టీ) ని ప్రవేశపెట్టినట్లు జీఎస్టీ అసిస్టెంట్ కమీషనర్(మంగళగిరి సర్కిల్) జి.లక్ష్మిసత్యవేణి అన్నారు. అమరావతి లోని విఐటీ –ఏపీ యూనివర్సిటీ బిజినెస్ స్కూల్ (వి.ఎస్.బి) ఆధ్వర్యంలో జి.ఎస్.టీ అమలుపై జరిగిన సదస్సులో ముఖ్య అతిధిగా పాల్గొన్న లక్ష్మిసత్యవేణి ప్రపంచ దేశాలలో 25 సంవత్సరాల నుండే జి.ఎస్.టీ అమలులో ఉందని ప్రస్తుతం మన దేశంలో కూడా అమలులోకి వచ్చిందని చెప్పారు. జీఎస్టీలో వచ్చిన పన్నులను కేంద్ర రాష్ట్రాల ప్రభుత్వాలు ఆయా వాటాల ఆధారంగా పంచుకుంటాయని అసిస్టెంట్ కమీషనర్ శ్రీమతి జి.లక్ష్మిసత్యవేణి చెప్పారు. ఈ సదస్సు లో విఐటీ ఎపి స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ డాక్టర్ ఎస్.జయవేల్, సమన్వకర్త డాక్టర్ నిమ్మి రోజ్ జాకబ్ పాల్గొన్నారు.



జి.లక్ష్మిసత్యవేణి

## వినాయక చవితి సందర్భంగా అన్నదాన కార్యక్రమం

**రాజధాని వార్తలు, రాయపూడి :** రాజధాని ప్రాంతమైన రాయపూడిలో మధ్యసెంటర్ నందు వినాయకచవితి అన్నదాన కార్యక్రమం నిర్వహించినారు. ఈ సందర్భంగా రాయపూడి కమిటీ పలు పూజా కార్యక్రమాలు జరిపిన తరువాత 4 వేల మంది భక్తులకు అన్న ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో కార్ టావెల్స్ సుభాని, ఆర్.నాగరాజు, బి.సతీష్, బి.రాజు, బి.కోటేశ్వరావు, కె.మురళీ, కరెంట్ శ్రీను, ఎం.కుమార్ స్వామి, ఎం.శ్రీను, ఎం.చిన్నా, ఎస్.కె.బుజ్జి, కృష్ణా, కాశీం భక్తులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ నిర్లిప్తత + అధికారుల అలసత్వం = 62 ప్రాణాలు

**కొండగట్టు రోడ్డు ప్రమాదం ...భారత దేశ చరిత్రలో అతి ఘోర రోడ్డు ప్రమాదాల్లో ఒకటిగా నిలిచింది. ఈ దుర్ఘటనలో మృతిచెందిన వారి సంఖ్య 62కు చేరుకుంది. ఈ ప్రమాదానికి గల కారణాలపై విచారణ జరుగుతోన్న సంగతి తెలిసిందే. బస్సుకు బ్రేకులు ఫెయిల్ అయినందునే ఈ ప్రమాదం జరిగిందని....ఈ ప్రమాదానికి డ్రైవర్ కారణం కాదని, ఆ ప్రమాదం నుంచి బయటపడిన బాలిక అర్చన వెల్లడించింది. అంతేకాకుండా బస్సుకు బ్రేకులు ఫెయిల్ అయిన సంగతిని ప్రయాణికులకు డ్రైవర్ వెల్లడించారని దూకేయదలచిన వారు దూకేయాలని సూచించారని ఆ బాలిక తెలిపింది.**



మొదట డ్రైవర్ అతి వేగం వల్లే బస్సు అదుపు తప్పి గోతిలో పడిందని అంతా భావించారు. అయితే గత ఏడాది ఉత్తమ డ్రైవర్‌గా అవార్డు అందుకున్న ఆ డ్రైవర్...నిర్లక్ష్యంగా బస్సు నడిపి ఉండడని ఆర్టీసీ అధికారులు అభిప్రాయపడ్డారు.ఆ ప్రమాదం జరిగిన ఘాట్ రోడ్డు పక్కన రియల్టర్లు తవ్విన 32 అడుగుల భారీ గొయ్యి వల్లే కొండగట్టు బస్సు ప్రమాదంలో మృతుల సంఖ్య భారీగా పెరిగిందని స్థానికులు చెబుతున్నారు. రోడ్డుకు పక్కనే ఉన్న వాగును పూడ్చి భవనాలు కట్టేందుకు రియల్టర్లు ఘాట్ రోడ్డు వాలులో ఉన్న మట్టిని తవ్వి వాగులో పోశారని వారు ఆరోపిస్తున్నారు. అందువల్లే అక్కడ 32 అడుగుల భారీ గొయ్యి ఏర్పడిందని అంటున్నారు. అ మట్టి లేకపోవడం వల్లే బస్సు ఒక్కసారికగా నిలువుగా ఆ గోతిలో పడి ప్రమాద తీవ్రత పెరిగిందని చెబుతున్నారు. గతంలోనూ ఓ ఆర్టీసీ బస్సు లోయ సమీపానికి వెళ్లి పెను ప్రమాదం నుంచి తప్పించుకుందని ఆ ప్రాంతంలో అనేక ఆటోలు, ద్విచక్ర వాహనా ప్రమాదాలకు గురయ్యాయని అంటున్నారు. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా....రియల్ ఎస్టేట్ వ్యాపారులు – అధికారులకు పట్టలేదని వారెవ్వరూ ఆ భారీ గోతిపై దృష్టి సారించలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ అక్రమ నిర్మాణాల రియల్టర్లకు పలు పార్టీల నాయకుల మద్దతు కూడా ఉందని అంటున్నారు. గతంలో చిన్న ప్రమాదాలు జరిగినపుడు స్పందిస్తే...నేడు ఈ పెను ప్రమాదం తప్పేదని, ఇప్పటికైనా ఆ భారీ గొయ్యిని పూడ్చి అక్రమ నిర్మాణాలు తొలగించాలని సహజ సిద్ధ వాగును పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

**యాజమాన్యం కక్షసాధింపులు**

బస్సు పనికిరాదని డ్రైవర్లు చెబితే వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, ఆర్టీసీ నష్టాలను సాకుగా చూపి డ్రైవర్లపై అధిక ఒత్తిడి పెంచి వారి పనిగంటలను రోజుకు 16 గంటలకు హెచ్చించారని ఆర్టీసీ యూనియన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ప్రమాదానికి కారణాలు

2007కు చెందిన ఈ బస్సు ఇప్పటికే 15 లక్షల కిలోమీటర్లు తిరిగింది. మూడేళ్ల క్రిందటే అది కాలం చెల్లిన బస్సు (స్క్రాప్)గా అవతరించింది. సామర్థ్యానికి మించి ప్రయాణీకులను ఎక్కించడం, రోడ్డు ఎటవాలుగా ఉండటం, పక్కన గొయ్యి ఉండటంతో ప్రమాద తీవ్రత భారీగా పెరిగిందని ఆర్టీసీ అధికారులు విశ్లేషించారు. 60 కిమీ వేగంతో వెళుతున్న బస్సు స్పీడు బ్రేకర్లు దాటిన తర్వాత కంట్రోలు తప్పిందని, ఆపై స్టీరింగ్ విరిగి చేతిలోకి రావడంతో మనం లోయలో పడిపోతున్నామని డ్రైవర్ హెచ్చరించాడని తీవ్రగాయాలతో ఉన్న ఆ బస్సు కండక్టర్ తెలిపారు. ఆ బస్సులో అనారోగ్యంతో వెళుతున్నవారు, గర్భిణిలు కూడా ఉన్నారని ఆయన ఏడుస్తూ వివరించారు.

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా గొగోయ్

**అక్టోబర్ 3న బాధ్యత స్వీకరణ**



**న్యూఢిల్లీ :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్‌మిశ్రా స్థానంలో అత్యంత సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్‌ను చీఫ్ జస్టిస్‌గా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నియమించారు. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా అక్టోబర్ 3న పదవీవిరమణ చేసిన అనంతరం గొగోయ్ భాద్యతలు స్వీకరిస్తారని ప్రధాని కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. సుప్రీంకోర్టు 46వ ప్రధాన న్యాయమూర్తిగా గొగోయ్ 2019 నవంబర్ 17 వరకు అంటే 13 నెలలపాటు బాధ్యతలు నిర్వహిస్తారు. బెంచ్‌లకు కేసుల కేటాయింపులో అవకతవకలకు పాల్పడుతున్నారంటూ దీపక్ మిశ్రాకు వ్యతిరేకంగా జనవరి 12న రంజన్‌గొగోయ్‌తో పాటు ఆయన సహచరులు జస్టిస్ చలమేశ్వర్(రిటైర్డ్), మదన్ బి.లోకూర్, కురియన్ జోసెఫ్‌లు మీడియా సమావేశంలో ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో చీఫ్ జస్టిస్‌గా గొగోయ్ పేరును సూచించరేమోనన్న సందేహాలు వెలువడ్డాయి. అయితే అత్యంత సీనియర్ న్యాయమూర్తిని చీఫ్ జస్టిస్‌గా నియమించాలన్న సంప్రదాయాన్ని అనుసరించి ఈ నెల నాలుగోతేదీన జస్టిస్ దీపక్ మిశ్రా ఆయన పేరును సూచించారు. తనకు అత్యున్నత న్యాయమూర్తి పదవిని అప్పగించిన దేశానికి రుణపడి ఉంటానని చీఫ్ జస్టిస్‌గా నియమితులైన అనంతరం గొగోయ్ తన స్పందనను తెలిపారు. అసోం కాంగ్రెస్ మాజీ ముఖ్యమంత్రి కేసబ్ చంద్రా గొగోరు కుమారుడైన గొగోరు 1978లో బార్ కౌన్సిల్‌లో సభ్యత్వం పొందారు. గౌహతి హైకోర్టులో న్యాయవాదిగా కొనసాగిన ఆయన 2001, ఫిబ్రవరి 28లో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2010 సెప్టెంబర్‌లో పంజాబ్, హర్యానా హైకోర్టుకు బదిలీ అయ్యారు. 2011, ఫిబ్రవరి 12న చీఫ్ జస్టిస్‌గా పదోన్నతి లభించిన అనంతరం 2012 ఏప్రిల్‌లో సుప్రీంకోర్టులో జస్టిస్‌గా పదోన్నతి పొందారు.

**క్రమశిక్షణకు మారు పేరు గొగోయ్**


జస్టిస్ గొగోయ్ ప్రభావంతమైన తీర్పులను ఇస్తారని అతని సహచరులు ప్రశంసించారు. గొగోయ్ క్రమశిక్షణకు మారుపేరని పేర్కొంటూ ప్రజాప్రయోజన వ్యాజ్యాలు (పిల్) దాఖలు చేయడంలో ఒక పద్ధతిని తీసుకువచ్చారని వారు పేర్కొన్నారు. సుప్రీంకోర్టులో రాజకీయనేతలపై దాఖలయ్యే కేసుల విచారణవేగంగా జరిగేలా ప్రత్యేకకోర్టులకు తరలించాల్సిందిగా జస్టిస్ గొగోరు నేత ృత్వంలోని బెంచ్ సూచించింది. మాజీ ముఖ్యమంత్రులు తమకు కేటాయించిన అధికారిక భవనాలను ఖాళీ చేయకుండా ఉండేలా ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ఆమోదించిన సవరణను ఈ ఏడాది మేలో గొగోయ్ నేతృత్వంలోని బెంచ్ తిరస్కరించింది. 2017 మేలో కోల్‌కతా హైకోర్టు న్యాయమూర్తి సిఎస్.కర్నన్‌ను కోర్టు ధిక్కారం కింద దోషిగా నిర్ధారించిన ఏడుగురు న్యాయమూర్తుల బెంచ్‌లో గొగోయ్ కూడా ఒకరు. రాజ్యాంగం ప్రకారం కోర్టులలో న్యాయమూర్తుల ఎంపిక, నియామక ప్రక్రియను పునపరిశీలించాలని, న్యాయమూర్తుల ప్రవర్తనను సరిదిద్దడానికి అవసరమైన చట్టపరమైన నిబంధనలను ఏర్పాటు చేయవలసి వుంటుందని గొగోయ్ సూచించారు. అస్సాంలోని అక్రమ వలసదారులను గుర్తించడానికి ఉద్దేశించిన జాతీయ పౌరుల రిజిస్ట్రేషన్ (ఎన్ఆర్‌సి)ను గొగోయ్ నేత ృత్వంలోని ధర్మాసనం పర్యవేక్షిస్తోంది. అలాగే లోక్‌పాల్ నియామకాన్ని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను కూడా గొగోరు పరిశీలిస్తున్నారు. చైతన్యవంతమైన న్యాయమూర్తులు, స్వతంత్రంగా వ్యవహరించే జర్నలిస్టులు ప్రజాస్వామ్య సూత్రాలను పరిరక్షించే వారిలో ముందు పీఠికలో నిలుస్తారని, అలాగే సమాజంలో మార్పులకు స్వచ్ఛమైన న్యాయవ్యవస్థ అత్యవసరమని అన్నారు.

## చంద్రబాబు కేసు వెనుక మోడీ లేరు : కన్నా



**రాజధాని ప్రతినిధి, అమరావతి :** ముఖ్యమంత్రి చంద్రబాబుపై అరెస్ట్ వారెంట్ జారీ కావడంపై బీజేపీ ఏపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ స్పందిస్తూ నోటీసులు రావడం వెనక ప్రధాని మోడీ ఉన్నారనేది అవాస్తవమని చెప్పారు. 2013 నుంచి కేసు నడుస్తోంది.. అప్పటి నుంచి వారికి నోటీసులు వస్తున్నాయని పేర్కొన్నారు. 2016 వరకు అప్పుడప్పుడు కోర్టుకు వెళ్తూ వచ్చారు.. చివరి 22 వాయిదాలకు వెళ్లకపోవడం వల్ల నాన్‌బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేశారని వెల్లడించారు. కేవలం ముద్దాయిలు 22 సార్లు కోర్టుకు వెళ్లకపోవడం వల్లనే వారెంట్ వచ్చిందని తెలిపారు. సాధారణంగా 3 సార్లు ముద్దాయిలు కోర్టుకు వెళ్లకపోతే నాన్‌బెయిలబుల్ వారెంట్ వస్తుందని వివరించారు. ఇప్పుడు కొత్తగా నోటీసుల వెనక మోదీ ఉన్నారని కొత్త డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. చంద్రబాబు మీద కేసు కాంగ్రెస్ హయాంలో పెట్టిందని గుర్తు చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అప్పట్లో కేసులు అన్ని ఉపసంహరిస్తున్నామని శాసనసభలో ప్రకటించింది.

## చెరుకుతో 30 అడుగుల శ్రీ వినాయకుడు



**బెంగళూరు :** వినాయక చవితి సందర్భంగా బెంగళూరు నగరంలోని జేపీ నగరలోని పుట్టేనహళ్ళిలో శ్రీసత్య సాయి గణపతి ఆలయంలో 50 టన్నుల చెరుకుతో వినాయకుడి విగ్రహాన్ని తయారు చేశారు. చెరుకుతో తయారు చేసిన వినాకుడికి పరిసర స్నేహి అని నామకరణం చేసి 4 వేల కేజీల లడ్డు నైవేద్యంగా పెట్టి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.ఏటా వినాయక చవితి వైవిధ్యంగా నిర్వహించడం శ్రీ సత్య సాయి వినాయక ఆలయ కమిటీ నిర్వహకుల అనవాయితి.శ్రీ సత్య సాయి వినాయకుడి ఆలయం దగ్గర 50 టన్నుల చెరుకుతో 30 అడుగుల ఎత్తు వినాయకుడి విగ్రహాన్ని తయారు చేశారు. పరిసరాలకు ఎలాంటి హాని కలగకూడదని చెరుకుతో వినాయకుడి విగ్రహం తయారు చేశారు. 50 మంది నిపుణులు కొన్ని రోజులు పగలు రాత్రి శ్రమించి చెరుకుతో వినాయకుడి విగ్రహాన్ని వైవిధ్యంగా, అందంగా తయారు చేశారని ఆలయం కమిటీ నిర్వహకులు తెలిపారు.


**4 వేల కేజీల లడ్డు**

వినాయక చవితి సందర్భంగా శ్రీ సత్య సాయి వినాయకుడి ఆలయంలో వినాయకుడి చెరుకు విగ్రహం ముందు 4 వేల కేజీలతో లడ్డు తయారు చేశారు. వెయ్యి కేజీల వేరుశెనగ పప్పుల పొడి, 2 వేల కేజీల చక్కెర, 700 కేజీల సన్ ఫ్లవర్ నూనె, 300 కేజీల నెయ్యి, 50 కేజీల జీడిపప్పు, 50 కేజీల ఎండు ద్రాక్ష, 5 కేజీల సుగంధ ద్రవ్యాలతో 4 వేల కేజీల లడ్డు తమారు చేసి స్వామి వారికి నైవేద్యంగా పెట్టామని ఆలయం కమిటీ సభ్యులు తెలిపారు.

**బెంగళూరులో ప్రప్రథమం**

బెంగళూరు నగరంలో వినాయక చవితి సందర్భంగా మొదటి సారి 4 వేల కేజీలతో భారీ లడ్డు తయారు చేసి స్వామి వారికి నైవేద్యంగా పెట్టారు. బెంగళూరు నగరంలో ఇంత భారీ లడ్డును తయారు చెయ్యడం ఇదే మొదటి సారి అని స్వామి వారి భక్తులు అంటున్నారు. మొత్తం మీద 30 అడుగుల ఎత్తులో చెరుకుతో తయారు చేసిన వినాయకుడి విగ్రహం, 4 వేల కేజీల వినాయకుడి విగ్రహం భక్తులను ఆకర్షిస్తున్నది.

## ఏపీలో 'ముఖ్యమంత్రి యువనేస్తం' ప్రారంభం



**రాజధాని ప్రతినిధి, అమరావతి :** ఉండవల్లిలోని ప్రజావేదికలో 'ముఖ్యమంత్రి యువనేస్తం' వైబ్‌సైట్‌ను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారం భించారు. భృతి, ఉపాధి, శిక్షణ, సంస్థలు, నిరుద్యోగుల సమాచారంతో యువత అవసరాలకు అనుగుణంగా బహుళ ప్రయో జనకరంగా వెబ్ పోర్టల్‌ను రూపొం దించారు. ఆధార్ కార్డు నంబర్ నమోదు చేయగానే అర్హత సమాచారం లభిస్తుంది. 22–35 ఏళ్ల మధ్య వయస్కులు... పీజీ లేదా డిగ్రీ, డిప్లొమా చదివి ఏడాది పూర్తై, తెల్ల రేషన్ కార్డు ఉన్నవారు అర్హులు. ముఖ్యమంత్రి యువనేస్తం పథకం ద్వారా అక్టోబరు 2నుంచి లబ్దిదారులకు రూ.వెయ్యి చొప్పున నిరుద్యోగ భృతి ఇవ్వనున్నారు. సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..." చరిత్ర సృష్టించ బోతున్నాం, ఇది చారిత్రక పథకం కాబోతోంది. ఎంతో అధ్యయనం తర్వాత, కసరత్తు తర్వాత ఈ పథకం తెచ్చాం. నా మనస్సుకు దగ్గరైన ఏకైక కార్యక్రమం 'ముఖ్యమంత్రి యువనేస్తం'. తెలుగుదేశం అమలు చేస్తున్న కార్యక్రమాలతో నేటి యువతకు ప్రపంచాన్ని జయించే శక్తి రావాలి. అనేక ఆసియా దేశాల్లో యువజనాభా తగ్గిపోతోందని.. భారత దేశంలో వచ్చే 3 దశాబ్దాల వరకు మనదేశంలో యువతదే హవా" అని చంద్రబాబు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, కొల్లు రవీంద్రలు పాల్గొన్నారు.

## రాజకీయాలకు వేదికగా చట్ట సభలు

(మొదటిపేజీ తరువాయి)

రోజులో సభ సాగకుండా చూడడానికే ప్రతిపక్షం ప్రయత్నించింది. పార్టీ మారిన తమ పార్టీ సభ్యులకు ప్రభుత్వంలో అధికారం ఇచ్చారని విమర్శిస్తూ సభకు హాజరుకావటమే మానేశారు. వరుసగా ప్రతిపక్షం సభకు గైర్హాజరు కావటం గతంలో జరుగలేదు. ప్రధాన ప్రతిపక్షం గైర్హాజరైన రెండు సమావేశాల్లో మాత్రమే శాసనసభను కొన్ని రోజులు నడపటానికి ప్రభుత్వ పక్షం ముందుకు వచ్చింది.నామ మాత్రమే అయినా ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్న భాజపా శాసనసభకు హాజరు కావటం గుడ్డిలోమెల్ల. ఎన్నికల సమయంలో అవసరం వచ్చినప్పుడు ఓటర్లు తమ సత్తా చూపుతునే వున్నారు. తిరుగులేని మెజార్టీతో అధికారంలో ఉన్న పార్టీలకు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. డబ్బే రాజకీయాలకు ముఖ్యం అనుకుంటున్న రోజుల్లో కోట్ల రూపాయిలు ఖర్చుపెట్టినా పార్టీలను, నాయకులను, ఓటర్లు ఘోరపరాజయం పాలుచేశారు. **ఈ సత్యాన్ని రాజకీయ నాయకులు గుర్తించకపోవటం – వారి దౌర్భాగ్యం – ప్రజల దురదృష్టం. ప్రజాభిప్రాయానికి భిన్నంగా, రాజకీయాలకు అనుగుణంగా చాలా నిర్ణయాలు జరిగి ఉండవచ్చు.** కాని రాజకీయ నాయకులకు వ్యతిరేకంగా ప్రజలు గెలిచిన సందర్భాలూ కొన్ని ఉన్నాయి.రాజకీయ పక్షాలు వీటిని గుర్తించటం అవసరం. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారు తమ బాధ్యతలను విస్మరించటం తగదు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా చెప్పుకునే ప్రచార సాధనాలూ ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకోవాలి.

## ముస్లింలలో చీలిక ?

(మొదటిపేజీ తరువాయి)

వారంతా రూ. 50 లక్షలు ఖర్చుపెట్టుకుంటానికి సిద్ధంగా ఉన్నారని, ఓడిపోయినా పర్వాలేదని, తమ ఉనికిని చాటుకునేందుకే ఈ ప్రయత్నమని ఒక విద్యాసంస్థ సీఈవో చెప్పడాన్ని బట్టి ఇది ముస్లింల ఓటర్లను చీల్చే ప్రక్రియేనని ఆ వర్గంలోని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇన్నాళ్లూ మౌనంగా ఉన్న ముస్లింలు ఈ సభ ఏర్పాటు చేయడానికి వెనుక అధికార గణం హస్తం ఉందని బాహాటంగానే చెబుతూ ముస్లింలను తాకట్టు పెట్టేందుకు ఒక వర్గం కుయుక్తులు పన్నుతున్నారని లేదంటే వారి ఓట్లను చీల్చి వారి పరిధిని నియంత్రించేందుకు తెరవెనుక ప్రయత్నాలు జరుగుతున్నాయని ముస్లిం వర్గాలు హెచ్చరిస్తున్నాయి. బీజేపీ హిందూత్వ ఎజెండాతో ముందుకు వస్తుండటంతో ఎస్సీ, ఎస్టీ, బీసీలతోపాటు ముస్లింలకు వేధింపులు తప్పవని కొందరు ముస్లిం వర్గాలను తీవ్ర భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. వాస్తవానికి రాష్ట్రంలో బీజేపీ ఉనికి అంతంతమాత్రమే.. అంతేకాకుండా 2014 ఎన్నికల్లో టీడీపీతో జతకట్టడం వల్లే ఆమాత్రం సీట్లు గెలవగలిగింది. రాష్ట్రంలో 2014నుంచి ముస్లింలకు సరైన ప్రాతినిధ్యంలేదని ముస్లిం వర్గాలు తీవ్ర నిరాశా, నిస్పృహల్లో ఉన్న విషయం తెలిసిందే. పథకాలు ఉన్నా, వాటి అమలు లోపభూయిష్టంగా ఉండటంతో వారి అభివృద్ధి అంతంతమాత్రంగానే ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో జస్టిస్ రాజిందర్ సంచార్ కమిటీ సిఫార్సులను రాష్ట్రం, దేశంలో అమలు చేయాలని డిమాండు చేయకుండా మూడేళ్ల నుంచి ముస్లింల సామాజిక స్థితిగతులపై పరిశీలన జరిపామని ఒక ఇంజనీరింగ్ కాలేజీ సీఈవో చెప్పడం హాస్యాస్పదం. దీని వెనుక ముస్లిం ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యం ఉన్నదా అనే అనుమానం పలువురు వ్యక్తం చేస్తున్నారు. ముస్లింలు రాజకీయంగా ఎదగాలంటే రాష్ట్రంలోని ముఖ్య రాజకీయాపార్టీలతో చర్చించి, తమకు ఎన్నిసీట్లు ఇస్తారో ముందుగానే తెలుసుకొని, దాన్ని బట్టి భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకోవచ్చు. లేదంటే, ఈ దేశంలో ముస్లిం తరపున మాట్లాడే ఒకే ఒక్క వ్యక్తి అసదుద్దీన్ ఒవైసీ ఆధ్వర్యంలోని ఎంఐఎం పార్టీ జాతీయపార్టీగా విస్తరించింది. ఆయనతో చర్చలు జరిపి పార్టీని నవ్యాంధ్రప్రదేశ్‌లో కూడా పాల్గొనేలా చేయవచ్చు. లేదంటే కొత్తపల్లి. గీతలా కొత్తపార్టీ పెట్టవచ్చు. స్వతంత్ర అభ్యర్థులుగా దిగితే ఓట్లు చీలడం మినహా ముస్లింలకు వచ్చే ప్రయోజనం, ప్రాతినిధ్యం ఏమీ ఉండదని ఆ వర్గంలోవారే పెదవి విరుస్తున్నారు. దళితులకు, ముస్లిం, ఇతర మైనార్టీలకు తమ గళాన్ని వినిపించేందుకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో చోటు లేకపోవడం విచారించతగిన అంశం. అయితే దీనిని ఎదుర్కొనేందుకు ముస్లిం రాజకీయ నాయకులతో పక్కా వ్యూహ రచనలు చేయాలి. అదేం లేకుండా కేవలం 25 నియోజక వర్గాల్లో స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ వేస్తారని ప్రకటించడం ఎంతవరకు సమంజసమని ముస్లిం యువత ప్రశ్నిస్తోంది.

మీరూ స్పందించండి
మీరు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలపై స్పందించండి
యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లేందుకు రాజధాని వార్తలు వేదికగా నిలుస్తుంది.
మీరు చేయాల్సిందల్లా సమస్యను ఫోటో తీసి, పరిస్థితిని క్లుప్తంగా
వివరించి వాట్సప్ ద్వారా మీ పేరుతో సహా
ఈ దిగువ ఉన్న వాట్సాప్ నంబర్లకు పంపించండి.
94406 62699

# ఫైటర్ బామ్మ మీనాక్షి రాఘువన్

ఆమె

**వయస్సు ఒక సంఖ్యమాత్రమే.. మనస్సు ఎల్లప్పుడూ యవ్వనంగా ఉంటుందని చెప్పడానికి మీనాక్షి రాఘువన్ ఒక ఉదాహరణ. 75 ఏళ్ల వయస్సులో యుద్ధవిద్యలో విద్యార్థులకు మెళకువలు నేర్పుతున్నారు. జీవితం అంటే బాధ్యత, ఒక అర్థం, పరమార్థం ఉందని ఆమెను చూస్తే తెలుస్తుంది.**





భారతదేశంలోనే పురాతన యుద్ధవిద్య కలరిపయట్టులో ఆరితేరి అనేక ఏళ్లుగా గురువుగా రెండు తరాలకు ఆవిద్యను పంచుతున్న మీనాక్షి రాఘువన్ గురించి కేరళలో ఎవరిని అడిగినా చెబుతారు. ప్రస్తుతం ఆమె వయస్సు 75 ఏళ్లు ఇప్పుడు కూడా అత్యంత చాకచక్యంగా కర్ర,కత్తి సాములు చేస్తూ విద్యార్థులకు మెళకువలు నేర్పుతుంటారు. 13వ శతాబ్దానికి చెందిన ఈ విద్యను ఈమె తండ్రి, భర్త ప్రాచుర్యంలోకి తెచ్చారు. ఈ వయస్సులో అందరూ వృద్ధాప్య సంబంధిత బాధలతో ఇళ్లకే పరిమితమై పోతారు. కాని మీనారాఘువన్ మాత్రం ఇప్పట్లో విశ్రాంతి తీసుకునే సూచనలు ఏమీ కనిపించడం లేదు. అత్యంత ప్రమాదకరంగా ఉండే ఈ విద్యను ఏడేళ్ల వయస్సునుంచే వంట బట్టించుకున్న ఈమె నారీ లోకానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. బరువైన ఖడ్గాలు,డాలు, కర్రలతో అత్యంత వేగంగా, బలంగా ప్రత్యర్థులపైకి దూసుకుపోవాల్సి ఉంటుంది. అంతేకాదు క్షణం ఏమరపాటుగా ఉన్నా.. ప్రాణం పోతుంది. ఆమె దగ్గరు ఈ యుద్ధవిద్యను నేర్చుకునేందుకు కేరళ నుంచి మాత్రమే విద్యార్థులు వస్తారనుకుంటే పొరపాటే.. ఆఫ్రికా, స్పెయిన్, ఇంకా మిగతా దేశాల నుంచి కూడా విద్యార్థులు వస్తారు. ఈ విద్యతో శరీరం శక్తిమంతం అవడమే కాకుండా మానసిక ధృడత్వం కూడా అలవడుతుందంటారామె.. మొదట్లో కరాలిని నేర్చుకునేందుకు ఆడపిల్లలకు ప్రవేశం లేనప్పటికీ ప్రస్తుతం ఆ పరిస్థితి మారిపోయింది. ఈ గురుకులంలో ముందు ఈ కళను అభ్యసించిన వారే మీనా రాఘవన్ సంస్థకు విరాళాలు అందించడంతో ఆడపిల్లలు ఈ విద్యలో ప్రావీణం పొంది ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుంటున్నారు. దీనిని ప్రదర్శించే సమయంలో ఆమె చీరలోనే ఉంటారు కాకపోతే కొంగుబిగిస్తారన్నమాట. కాని ఒక్కసారి యుద్ధవిద్యలోకి వెళ్లారంటే ఆమెలో మనం ఆడపులిని చూస్తాం. గాజుల స్థానంలో డాలు లేదా కత్తి

ఉంటుంది. మీనాక్షి అమ్మ లేదా మీనాక్షి గురుకులంలో నేర్పించే కలయరిపట్టు చాల వరకు డాన్స్ భంగిమలను పోలి ఉంటుంది. ఇది స్వీయ రక్షణకు ఎంతోగానో ఉపయోగ పడుతుంది. ఆమె 68 ఏళ్ల నుంచి దీన్ని అభ్యసిస్తున్నారు. ప్రస్తుతం ఆమె వద్ద 150 మంది విద్యార్థులు ఉన్నారు. కేరళలోని కొజికోడ్ వెటకర వద్ద కడతానందన్ కలారి సంగంనులో ఆమె శిక్షణనిస్తున్నారు.

ఏడేళ్ల వయస్సులో ఆమె తండ్రి దము వద్ద ఈ శిక్షణ పొందానంటారు. నిజానికి ఆమె ఆ వయస్సులో సాంప్రదాయక నృత్యం అభ్యసిస్తుండగా, దానిలో మరింత నైపుణ్యం సంపాదించే ందుకు ఆమె తండ్రి కలారి (శిక్షణ ప్రాంగణము)ని పరిచయం చేశారన్నారు. తర్వాత 1949లో వీపీ రాఘువన్ అప్పుడే ప్రారంభించిన గురుకులంలో కలారి శిక్షణ పొందానన్నారు.

బౌద్ధ బిక్షువులు దక్షిణ భారతదేశంలో పర్యటించినప్పుడు కీ.పూ 5వ శతాబ్దంలో ఈ విద్యను రూపొందించారని, వారితోపాటు చైనా, మలేషియా మరికొన్ని దేశాలు ఈ విద్య ప్రవేశించిందని అక్కడ కరాటే, జూడోగా ప్రసిద్ధి చెందిందంటారు. 17 ఏళ్ల వయస్సులో ఆమె తన గురువు రాఘువన్‌ను వివాహం చేసుకున్నారు. అయితే అది ప్రేమవివాహం కాదని పెద్దలు కుదిర్చిన పెళ్లే అని చెబుతూ, గురువుకు–శిష్యులకు మధ్య పవిత్ర బంధం ఉండాలని, కలారియపట్టుపై తనకున్న ఆసక్తిని గమనించిన తన తండ్రి ఆయనకిచ్చి పెళ్లిచేశారని చెబుతారు.

మనస్సు, శరీరం, ఆత్మకలిస్తేనే కలరియపట్టు అని ఆమె చెబుతారు. స్వీయరక్షణ కోసం శారీరక ధృడత్వంతో ఆయుధాలు లేకుండా చేసే విద్యను మెపయట్లు అంటారని, ప్రత్యేకమైన కర్రలు, ఇనుప చువ్వలు, లాఠీలతో చేసే విద్యను కోల్తారి, లేదా అంకతరి అంటారు. కత్తులు, ఈటెలు, వంటి పదునైన ఆయుధాలతో అభ్యాసం చేయడం చాలా కష్టమంటారు. కలారిలో ఆయుర్వేద వైద్యం కూడా ఉంటుందని నాడీ కండరాలు, అస్తిపంజరం దెబ్బతిన్నప్పుడు మర్మాస్ అంటే మానవ దేహంలోని ముఖ్యమైన కేంద్రాల ద్వారా వైద్యం చేస్తామని మీనాక్షి అమ్మ చెబుతుంటారు. కేరళ, ఆత్యాధ్మికతకు సంస్కృతి, కళలకు పెట్టింది పేరని, వాటిని వేరు చేసి కేరళను చూడలేమన్నారు. కలారిలో నేర్చుకునేందుకు అంతంలేదని ఇప్పటికీ తానొక విద్యార్థినిగానే భావిస్తుంటానని ఆమె వెల్లడించారు. కలారియపట్టు కళద్వారా ప్రత్యేకతను చాటుకున్న ఆమె ప్రచారానికి దూరంలో ఉంటారు.

ఆడవాళ్లు అత్యంత సుకుమారంగా ఉంటారని అందువల్ల ఇలాంటి విద్యలకు దూరంగా ఉండాలని కోరుకుంటారుగాని, అన్నివిధాలా ఫిట్‌గా ఉండాలంటే మాత్రం ఈ విద్య ఉపయుక్తంగా ఉంటుందన్నారు. శరీరం, బుద్ధి వికసిస్తుందన్నారు. మహిళలు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నప్పుడు స్వీయ రక్షణ మెలకుళవులు ఎంతగానో ఉపయోగ పడతాయంటారు. ఆమె భర్త 2009లో మృతి చెందగా, ఆయన స్థానంలో ఆమె యుద్ధ విద్యను అందిస్తున్నారు. చిన్నారులకు నేర్పడంలో ఎంతో ఆనందం ఉంటుందన్నారు.

ఆమెకు నలుగురు పిల్లలు మరో నలుగురు మనవలూ ఉన్నారు. వారంతా కూడా ఈ విద్యను నేర్చుకున్నవారేనని నాతర్వాత ఈ విద్యను వారే ప్రాచుర్యంలోకి తెస్తారన్నారు. 75 ఏళ్ల వయస్సులో ఏడాదికి చెన్నై, బెంగళూరుతో కలపి ఏడాదికి 60 ప్రదర్శనలు ఇస్తానన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు వచ్చినా దాన్ని తట్టుకుని నిలబడుతున్నానని, పిల్లలు తనకు ఎంతో సపోర్టుగా ఉంటారన్నారు. మరింత ఎక్కువకాలం ఆరోగ్యంగా ఉంచితే మరింతమందికి ఈ విద్యను అందిస్తానని ప్రతిరోజు దేవుడిని కోరుకుంటున్నానన్నారు. మీనాక్షి అమ్మ ఆయురారోగ్యాలతో వర్థిల్లాలని కోరుకుందాం..

– ఖాన్

## కాలమ్

### డీజే సౌండ్ ఎక్కువైంది నాయనా...

ఒకాయన ఓరోజు.... ఒక వంతెన మీద నడిచి వెళుతున్న సమయంలో ఎక్కడ నుంచో ఒక పెద్ద కేక వినిపించింది... "ఆగు" అని. వెంటనే ఆయన ఆగిపోయాడు. వెంటనే ఆయన ముందే వెంతెన కూలి పోయింది. ఆ ఆకాశవాణికి కృతజ్ఞతలు తెలిపి వెళ్ళి పోయాడు. కొన్నాళ్ళ తర్వాత, ఆ మనిషి వానలో తడిసి వెళ్తుండగా మళ్ళీ అదే కేక వినిపించింది. "ఆగు" అని. ఆయన ఆగిపోయాడు. వెంటనే ఆయన ముందే కొద్ది దూరంలో ఒక పిడుగు పడింది. అయ్యా... మీరెవరండీ... ఇన్ని సార్లు అరిచి, నా ప్రాణాలు కాపాడారు. నాయనా నేను నీ క్షేమం కోరే దేవ దూతని. ఆ మనిషి : అయ్యా మరి నా పెళ్లి సమయంలో మీరెందుకు అరవలేదు... దేవదూత : నేను అరిచాను నాయనా.. డీజె ఎక్కువ ఉండటం వల్ల నీకు వినపడి సావలేదు...

### ఈ ఇల్లే ఒక అసెంబ్లీ

కొత్తగా కాపురానికి వచ్చిన కోడలితో.. అత్త: చూడమ్మా ఈ ఇల్లు అసెంబ్లీ లాంటిది.. మీ మామగారు.. ముఖ్యమంత్రి .. ఆయన విదేశీ, రక్షణ వ్యవహారాలు చూసుకుంటారు.. నేను ఉపముఖ్యమంత్రి ని..హోమ్ శాఖ, ఆహార భద్రత శాఖ, సాంస్కృతిక శాఖ వగైరా చూసుకుంటాను..ఇక మావాడు.. అదే మీ ఆయన.. ఉద్యోగ భద్రత శాఖ, రవాణాశాఖ చూసుకుంటాడు.. ఇక నా కూతురు...అదే నీ ఆడపడుచు.. నిర్వహణా శాఖ, క్రీడలు వగైరా చూసుకుంటుంది.. మరి నీకు ఏ శాఖలు కావాలో చెప్పు.. నీకు గృహ నిర్వహణ, ఆరోగ్య పర్యవేక్షణ శాఖ లు ఇద్దామనుకుంటున్నాం ఏమంటావ్ ??

వినయంగా కోడలు : అయ్యో అంత పెద్ద పెద్ద శాఖలు నిర్వహించే వయసూ అనుభవమో నాకు లేవు అత్తయ్యా.. అవి కూడా మీరే వుంచుకొని నాకు ప్రతిపక్ష నాయకురాలి హోదా ఇవ్వండి చాలు.. వాకౌట్ చెయ్యడానికి ఎవరూ లేకపోతే ఏం బాగుంటుంది చెప్పండి.

## వక్ఫ్‌బోర్డు ఆస్తులు మింగుతున్న ఎమ్మెల్యే జలీల్‌ఖాన్

**సీపీఐ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్**



**రాజధాని వార్తలు విజయవాడ :** ముస్లిం మైనార్టీల సంక్షేమానికి పాటుపడాల్సిన వక్ఫ్‌బోర్డు చైర్మన్, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ కంచే చేను మేసిన చందంగా వక్ఫ్‌బోర్డు ఆస్తులను దిగమింగుతున్నారని సీపీఐ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ విమర్శించారు. ఈ నెల 15న బీఆర్టీఎస్ రోడ్డులో జరగనున్న మహాగర్జనను జయప్రదం చేయాలని కోరుతూ సీపీఐ, సీపీఎం నాయకులు గొల్లపాలెం గట్టు రోడ్డు జోడు బొమ్మల సెంటర్ నుంచి ప్రచార యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా దోనేపూడి శంకర్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో వక్ఫ్‌బోర్డు భూములకు రక్షణ కరువైందన్నారు. ఇప్పటికే కొండపల్లిలోని ఈనాం భూములు, భవానీపురం లోని దర్గాభూములు, అన్యాక్రాంతం అయ్యాయని, తాజాగా రూ.100 కోట్ల విలువ కలిగిన జమ్మామసీదు స్థలాన్ని చందన బ్రదర్స్ యాజమాన్యంతో కమ్మక్కై కారుచౌకగా వారికి కట్టబెట్టేందుకు ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ ప్రయత్నించారన్నారు. రూ.460 కోట్ల కేంద్ర నిధులతో ప్రారంభించిన స్ట్రాం వాటర్ పనులు నత్తకంటే హీనంగా నడుస్తున్నాయని దుయ్యబట్టారు. సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు తాడి పైడయ్య, కొట్టు రమణ రావు, కుర్రా శివకుమార్, నగర మహిళా కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ, సీపీఎం నాయకులు బోయి సత్యబాబు, వి.శ్రీనివాసరావు, గాదే వెంకటరెడ్డి, కొండారెడ్డి, బార్గవ్ పాల్గొన్నారు.



# రాజధాని క్లాసిఫైడ్స్

## నివాస ప్లాట్లు

**నవులూరు**
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో 500, 1000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ :9440662699

**రాయపూడి**
రాజధాని ప్రాంతంలోని రాయపూడి గ్రామ పరిధిలో 500, 1000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్:9440662699

**రాయపూడి**
రియల్ఎస్టేట్ క్రయ, విక్రయాలకు సంప్రదించడం న్యూసింగపూర్ రియల్ ఎస్టేట్
ఫోన్ : 98484 42436

**రాయపూడి**
చంద్రిక ట్రేడర్స్ నిర్మాణ రంగానికి సిమెంట్, స్టీలు,పైపులు అమ్మబడును.
ఫోన్ : 9908073516

**విజయవాడ**
న్యూఫేస్ కీనిక్ , డా॥మేహబూబ్
ఫోన్ : 9849122788

**విజయవాడ**
అష్రఫ్ మెటర్నిటీ & ఇ,ఎన్‌టి
డా॥ రెహమాన్
ఫోన్: 0866-2475087

**విజయవాడ**
శ్రీమానస సైకియాట్రిక్
డా॥ అయోధ్య ఆర్.కె
ఫోన్:0866-2436647

విశాఖపట్నం
చింతలూరు ఆయుర్వేద
డా॥ విశ్వనాథ్
ఫోన్ :90329 90138

## షాప్స్

**తుళ్ళూరు**
రేమాండ్స్‌ట్రైలర్స్
ఫోన్ : 9492470426

**తుళ్ళూరు**
వైభవ్ డ్రెస్సెస్
ఫోన్ : 9848407935

**తుళ్ళూరు**
రాజా గోల్డ్ కవరింగ్
ఫోన్ : 9581500500

**తుళ్ళూరు**
శ్రీసాయి జ్యూయలరీ వర్క్స్
ఫోన్ :9247171083

**తుళ్ళూరు**
ఎస్.ఎమ్(స్టైల్ ఫర్ మెన్) ట్రైలర్స్
ఫోన్ 9440307123

**రాయపూడి**
ఖాజా ఖాదర్ రైస్ స్టోర్స్
ఫోన్ : 9603990791

**రాయపూడి**
వర్షిత ఫోటోస్టాట్
ఫోన్ : 9985853188

## వాణిజ్య ప్లాట్లు

**నవులూరు**
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

**ఐనవోలు**
రాజధాని ప్రాంతంలోని ఐనవోలు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

## ఇతరములు

ఓంశ్రీ సాయిరాం రిజిస్ట్రేషన్ కన్సల్‌టెన్సీ & సర్వీసెస్ అన్ని రకముల దస్తావేజులు, అగ్రిమెంట్లు వ్రాయబడును. స్టాంపులు అమ్మ బడును. అన్ని రకముల మోటారు వాహనములకు ఇన్సూరెన్స్ కట్టించుకొనబడును.
**పాపన చక్రవర్తి డాక్యుమెంట్ రైటర్**
ఫోన్ 9502424704, 08645 244992
సబ్- రిజిస్ట్రార్ ఆఫీస్ ఎదురు, తుళ్లూరు

**వెంకటపాలెం**
సాయిలాస్య రియల్ఎస్టేట్ & ఫైనాన్స్ కన్సెల్టెన్సీ, గాదె నాగేశ్వరరావు
ఫోన్ : 95151 53939

**మందడం**
ఎస్.ఆర్.కె. గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : 9553023388

**వెలగపూడి**
సాయి గణేష్ ట్రెడర్స్: నిర్మాణ రంగానికిసిమెంట్, స్టీలు, పైపులు, పెయింట్‌లు అమ్మబడును.
ఫోన్ : 9640811333

**రాయపూడి**
కాకతీయ ఫుడ్ కోర్ట్
ఫోన్ 9848021898

## హస్పటల్స్

**విజయవాడ**
ఆంధ్ర హస్పటల్,
డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : 9177219900

## విద్యా సంస్థలు

**ఐనవోలు**
విఐటీ-ఏపీ యూనివర్శిసిటీ
ఫోన్ :0863 2370444

**నీరుకొండ**
ఎస్ఆర్ఎమ్ యూనివర్శిసిటీ
ఫోన్ :0863 2343000

గమనిక : క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/లేదా అతనిపై చట్టరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

\- మేనేజర్

ప్రకటనలకు సంప్రదించండి 7680994755


## రాయపూడిలో 'దోమలపై దండయాత్ర'

**రాజధాని వార్తలు, రాయపూడి :** రాజధాని ప్రాంతం, మండల పరిధిలోని రాయపూడిలో దోమలపై దండయాత్ర కార్యక్రమం జరిగింది. గ్రామ పంచాయతీ కార్యదర్శి గాదె వెంకటప్పయ్య ఆధ్వర్యంలో దోమల నివారణకు సంబంధించి అవగాహన కల్పించే ప్లే కార్డులను ప్రదరిస్తూ ర్యాలీ జరిపారు. ఈ కార్యక్రమంలో దోమల నివారణకు మరుగు నీటి తొలగింపు, కాలవల్లో బ్లీచింగ్, ఫెనాయిల్ చల్లించడం లాంటి కార్యక్రమాలు చేశామని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి, దోమల వ్యాప్తి నిరోధానికి జరిగే కృషిలో గ్రామస్థులందరూ భాగస్వాములు కావాలని ర్యాలీలో పాల్గొన్న పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పిలుపు ఇచ్చారు. ర్యాలీ గ్రామంలోని ప్రధాన వీధుల్లో కొనసాగింది. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, ఎల్.ఈ స్కూల్ ప్రధానోపాధ్యాయులు సుబ్బరావు, వి.ప్రసాద్, డా॥



లక్ష్మినారాయణ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు ఎ.ఎన్.యమ్.ఎస్ పాల్గొన్నారు.

## చంద్రబాబు అరెస్ట్ వారెంట్

(మొదటిపేజీ తరువాయి)

సంభందించి ఉన్న అంశం కనుక కోర్టు వారెంటును ఉపయోగించుకుంటే తెలంగాణ ముందస్తు ఎన్నికలలో తెదేపాకు లాభం ఉంటుందని తెలుగుదేశం భావిస్తోంది. బాబ్లీ ఆందోళన ఉత్తర తెలంగాణ ప్రాంతం మేలు కోసం చేసిందని ప్రజాప్రయోజనాల కోసం చేసే ఉద్యమాలు నేరాలు ఘోరాలు కావని చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. వారెంటు విషయంలో చంద్రబాబు కోర్టుకు హాజరైతే న్యాయ వ్యవస్థను గౌరవించినట్లు కావడమే కాక రాజకీయంగా ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలుగుదేశం భావిస్తుంది. ఈనెల 24 న ఐక్యరాజ్యసమితిలో వ్యవసాయంపై చంద్రబాబునాయుడు కీలక ఉపన్యాసం ఇవ్వనున్న తరుణంలో అరెస్టు వారెంటు రావడం చంద్రబాబునాయుడునే కాక తెలుగు ప్రజలను అవమానించడమని తెదేపా నాయకులు అంటున్నారు. వారెంటు విషయంలో ప్రత్యామ్నాయ న్యాయ మార్గాలు ఉన్నా వాటిని ఉపయోగించుకోకుండా కోర్టుకు హాజరుకావడం రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా బాగుంటుందని తెలుగుదేశం వర్గాలు బావిస్తున్నాయి.

చంద్రబాబును ఇరుకునపెట్టే ప్రయత్నాలు కేంద్రం ప్రారంభించినట్టు వార్తలు వచ్చిన వెంటనే రానున్న మూడు నెలలకు రూపొందించిన వ్యూహాలలో మార్పులు చేయాలని చంద్రబాబు నిర్ణయించినట్లు తెలుస్తుంది.

## తెలంగాణ కాంగ్రెస్ ప్రచారకర్తగా చిరంజీవి




**రాజధాని వార్తలు ప్రతినిధి, హైదరాబాద్ :** కాంగ్రెస్‌కు స్టార్ ప్రచారకర్తగా రెండు తెలుగు రాష్ట్రాల్లో అభిమానులున్న చిరంజీవిని స్వయంగా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రచారం చేయాల్సిందిగా కోరే అవకాశం కనిపిస్తోందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణలో ఎన్నికలను కాంగ్రెస్, రాహుల్ గాంధీ చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. అందివచ్చిన అన్ని అవకాశాలను వినియోగించుకుని అధికారంలోకి రావడమే ధ్యేయంగా కాంగ్రెస్ పావులు కదుపుతోంది. ఇందులో భాగంగానే ప్రధాన శత్రువైన టీడీపీతో, కమ్యూనిస్టులతో జతకట్టింది. ఇదిలా ఉంటే చిరంజీవి ఎలాగైనా ప్రచారం చేసేలా చూడాలని తెలంగాణలోని కాంగ్రెస్ సీనియర్ నేతలు అధిష్టానంపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. స్వాతంత్ర్య సమరయోధుడి కథతో రూపొందుతున్న సినిమా సైరా షూటింగ్, మరోవైపు ప్రచార బాధ్యతలు ఎలా నిర్వర్తిస్తారనేది వేచి చూడాలి. ఇదిలా ఉంటే కేసీఆర్ వాక్చాతుర్యం, పదునైనా పదాలు, ఎమోషనల్ స్పీచ్‌ల ముందు చిరంజీవి తన ప్రసంగంతో ఆకట్టుకుంటారా అనే అనుమానం రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. చిరంజీవికి స్టార్ డమ్ ఉండొచ్చు కానీ అది తెలంగాణలో కేసీఆర్ ముందు దిగదుడుపే అని ఎంతమంది చిరంజీవులు వచ్చినా... కారు స్పీడుకు బ్రేకు వేయలేరని గులాబీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

**తెలంగాణ నేతల అసంతృప్తి**

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తెలంగాణ ముందస్తు ఎన్నికల నేపథ్యంలో తీసుకున్న నిర్ణయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కోసం అభ్యర్థు ఎంపిక చేసే స్క్రీనింగ్ కమిటీలో ఒక్క తెలంగాణ నేతకు కూడా చోటు కల్పించకుండా భక్త చరణ్ దాస్(ఏఐసీసీ సెక్రటరీ–ఒడిశా), 2. జోతిమని సెన్నిమలై (తమిళనాడుకు చెందిన యూత్ కాంగ్రెస్ మాజీ సభ్యులు, రాహుల్ గాంధీ సన్నిహితులలో ఒకరు'), 3. షర్మిష్ట ముఖర్జీ(పశ్చిమబెంగాల్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కూతురు) రాహుల్ పెద్ద తప్పు చేశారని తెలంగాణకాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. తెలంగాణ రాజకీయాలపై మంచి పట్టున్న కాంగ్రెస్ సీనియర్ నేతలు గులాంనబీ ఆజాద్, దిగ్విజయ్ సింగ్, వాయలార్ రవి, వీరప్ప మొయిలీ లాంటి నేతలకు ఈ బాధ్యతలను అప్పగించివుంటే ఫలితాలు మెరుగ్గా ఉండేవని తెలంగాణలోని ఓ సీనియర్ జర్నలిస్ట్ అభిప్రాయపడ్డారు.

## 'సేవా దివస్' గా ప్రధాని మోడీ జన్మదినం



**న్యూఢిల్లీ :** ప్రధాని మోడీజన్మదినాన్ని సేవా దివస్‌గా నిర్వహించనున్నారు. ఈనెల 17న జన్మదినాన్ని ఆయన పార్లమెంటరీ నియోజకవర్గమైన వారణా సిలో విద్యార్థులతో జరుపు కుంటా రు. 1950లో పుట్టిన ఆయన 68వ పుట్టినరోజున ఆయన జీవితకథతో రూపొందిన 'చలో జీతే హైన్' అనే 32 నిముషాల నిడివికల సినిమాను ఆయన వారితో వీక్షిస్తారు. ఆపై అనేక కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. మోడీ ఈనెల 17,18ల్లో వారణాసిలోనే ఉండి ప్రసిద్ధ కాశీవిశ్వనాధుడి ఆలయాన్ని సందర్శిస్తారని అధికారులు తెలిపారు. ప్రత్యే పారిశధ్య కార్యక్రమాలు, వైద్యఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తారని అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ ఆదేశాల మేరకు అన్ని మోడీ రాకకు ఏర్పాట్లు పూర్తి చేశామని అధికారులు వెల్లడించారు.

## రాజధానిలో ముస్లింలకు స్థలం కోసం వినతి



**రాజధాని ప్రతినిధి, గుంటూరు :** అమరావతి రాజధానిలో ముస్లింలకు 125 ఎకరాలు కేటాయించాలని ఈ నెల 18న కర్నూలు లో జరిగే కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభ లో రాహుల్ గాంధీతో ప్రకటన చేయించాలని పిసిసి చీఫ్ రఘువీరారెడ్డిని కోరిన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బషీర్ అహ్మద్, ముస్లిం లీగ్ గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు, పొన్నూరు నియోజక వర్గ ఇంచార్జ్ షేక్ కైఫ్ తదితరులు ఉన్నారు.

## 19న ఇందిరాగాంధీ స్టేడియంలో జ్ఞాన భేరి

**రాజధాని ప్రతినిధి, విజయవాడ :** ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొననున్న జ్ఞానభేరి వేదికను ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియానికి మార్చినట్లు కలెక్టర్ లక్ష్మీకాంతం తెలిపారు. ఆయన శుక్రవారం కానూరు వీఆర్ సిద్ధార్థ పీవీపీ సిదార్థ కళాశాల ప్రాంగ ణాలను పరిశీలించారు. వందలాది కళాశా లల నుంచి తరలివచ్చే విద్యార్థులకు ఇక్కడ ఏర్పాట్లు చేయడానికి అనుకూలంగా లేదని తేల్చి చెప్పారు. మొదట బందరు కృష్ణా యూ నివర్సిటీ స్థల పరిశీలన జరగ్గా అంతగా అను కూలంగా లేకపోవడంతో కానూరు వీఆర్ సిద్ధార్థ కళాశాల పరి శీలించారు. అక్కడ కూడా పరిస్థితి అనుకూలంగా లేకపో వడంతో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం (విజయవాడ)లోనే జ్ఞానభేరి ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఆయనతో పాటు జిల్లా టూరిజం అధికారి, వెలగా జోషి, విద్యా మండలి వైస్ చైర్మన్ నరసింహారావు, కృష్ణావర్సిటీ వైస్ చైర్మన్ కృష్ణారావు, పెనమ లూరు తహసీల్దార్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


## మహాత్మాగాంధీ 150వ జయంతికి ప్రత్యేక లోగో

**న్యూఢిల్లీ :** కేంద్ర పర్యాటకశాఖ మహాత్మాగాంధీ 150వ జయంత్యుత్సవాల్ని పురస్కరించుకుని ప్రత్యేక లోగో విడుదల చేస్తున్నట్లు కార్యదర్శి రషిం వర్మ తెలిపారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 'ఇది గాంధీ భూమి' (ది ల్యాండ్ ఆఫ్ గాంధీ) అనే వ్యాఖ్యలు ఇన్‌క్రెడిబుల్ ఇండియా లోగోపై సుస్పష్టంగా కనిపించేలా ముద్రించి ప్రత్యేకంగా తయారు చేస్తున్నామన్నారు. అదేవిధంగా గాంధీజీ దేశ, విదేశాల్లో గడిపిన జీవిత విశేషాలతో పలు కార్యక్రమాల్ని జయంతి రోజున నిర్వహించేందుకు యోచిస్తున్నట్లు చెప్పారు. అక్టోబర్ 2 నుంచి మార్చి 30వరకు దేశ, విదేశాల్లో జయంత్యుత్సవాల నిర్వహించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది.

# ప్రపంచంలో పెరుగుతున్న పేదరికం

- దళితుల స్థితి మరీ దారుణం
- ప్రపంచబ్యాంకు నివేదికలో వెల్లడి

ప్రపంచ దేశాలలో ఆకలితో అలమటించేవారి సంఖ్య మళ్ళీ పెరుగుతోందని ఐక్యరాజ్య సమితి తాజా నివేదిక వెల్లడించింది. కొంత కాలంగా తగ్గుతూ వస్తున్న అన్నార్తుల సంఖ్య మళ్లీ పెరుగుతోందని తెలిపింది దీనికి కారణం "ఘర్షణలు, వాతావరణ మార్పులు కరువు కాటకాలేనని 2018 సుస్థిర అభివృద్ధి లక్ష్యాల నివేదిక పేర్కొంది. 2008 నుంచి కొనసాగుతున్న ప్రపంచ ఆర్థిక సంక్షోభం, నయా ఉదారవాద విధానాలే అసలు కారణమని సామాజిక వేత్తలు విశ్లేషిస్తున్నారు. ఆకలితో మలమలలాడే వారి సంఖ్య పెరుగుతున్నదంటే ప్రపంచ వ్యాప్తంగా పౌష్టికాహార లేమితో బాధపడుతున్న వారి సంఖ్య కూడా పెరిగినట్టేనని ఐరాస నివేదిక వెల్లడించింది. 2015లో 10.6 శాతంగా ఉన్న వీరి సంఖ్య 2016 నాటికి 6 శాతానికి పెరిగింది. అంటే 2015లో ప్రపంచ వ్యాప్తంగా 77.7 కోట్ల మంది పౌష్టికాహార లోపంతో బాధపడుతుండగా, 2016 నాటికి వీరి సంఖ్య 81.5 కోట్లకు చేరుకుంది. 2017లో పరిశీలిస్తే ఐదు సంవత్సరాల లోపు వయస్సున్న 15.1 కోట్ల మంది వారి వయస్సు కన్నా తక్కువ ఎత్తుతో బాధపడుతున్నారు. 5.1 కోట్ల మంది ఎత్తుకు తగ్గ బరువు లేకుండా బాధపడుతున్నారు. 3.8 కోట్ల మంది అధిక బరువుతో బాధపడుతున్నారని నివేదిక తెలిపింది. 2016లో అభివృద్ధి చెందుతున్న దేశాలలో వ్యవసాయ రంగానికి 12.5 బిలియన్ డాలర్లుగా ఉన్న ఆర్థిక సహాయం 6 శాతానికి పడిపోయింది. 1980ల ప్రాంతంలో 20 శాతంగా ఉన్న ఆర్థిక సహాయం ఇప్పటికి 6 శాతానికి పడిపోయింది. 2010లో 491 డాలర్లుగా ఉన్న వ్యవసాయ రాయితీలు 2015 నాటికి 200 మిలియన్ డాలర్లకు తగ్గాయి. 2016లో దాదాపు 26 దేశాలు సాధారణ ఆహార పదార్థాల ధరలలో అత్యధిక స్థాయిని చూశాయి. ఇది ఆహార భద్రతపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతోందని ఆ నివేదిక తెలిపింది.




**కటిక దారిద్ర్యంలో 27 కోట్లమంది**

2012నాటికి భారతదేశంలో27 కోట్ల మంది తీవ్రమైన పేదరికంలో ఉన్నారని, ఇందులో అత్యధిక సంఖ్యలో ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందినవారు పేదరికంతో బాధపడుతున్నారని ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక ఒకటి తెలిపింది. 20 04 -11 మధ్య భారతదేశంలో చోటు చేసుకున్న పరిణామాల్ని లెక్కులోకి తీసుకొని 2012 నాటి గణాంకాల్ని విడుదల చేస్తున్నామని ప్రపంచబ్యాంకు తెలియజేసింది. పేదల్లో అత్యధిక సంఖ్యలో ఎవరున్నారు? వారు ఎక్కడ జీవిస్తున్నారు? వారు దేనిపై ఖర్చు చేస్తున్నారు? వంటి వివరాల్ని ఈ నివేదికలో తెలియజేశారు. నిజానికి గత నాలుగు సంవత్స రాలుగా పేదరికం బాగా పెరిగిందని అనేక సర్వేలు వెల్లడించాయి. ముఖ్యంగా నోట్లరద్దు తర్వాత ఇది మరింత తీవ్రతరమైంది. కానీ ప్రపంచబ్యాంకు ఈ కాలానికి సంబంధించిన తాజా నివేదిక ఇంకా రూపొందించలేదు. 2012 నాటికి భారతదేశంలో ప్రపంచ దారిద్ర్యరేఖకు దిగువన 27కోట్లమంది ఉన్నారు. అంటే ప్రతీ ఐదుగురు భారతీయుల్లో ఒకరు పేదరికంతో బాధపడుతున్నారు. మొత్తం పేదల్లో 62 శాతంమంది తక్కువ ఆదాయం కలిగిన ఉత్తరప్రదేశ్ (6కోట్లమంది), మధ్యప్రదేశ్ (2.4కోట్లు), బీహార్(3.6కోట్లు), రాజస్థాన్(కోటి మంది), చత్తీస్‌గఢ్(కోటిమంది), జార్ఖాండ్ (1.3కోట్లు), ఒడిశా(1.4కోట్లు) వంటి రాష్ట్రాల్లో జీవిస్తు న్నారు. భారత దేశంలోని గ్రామీణ ప్రాంతాలు పేదరికానికి నిలయాలుగా మారాయి. మొత్తం పేదల్లో 80శాతం మంది గ్రామాల్లో బతుకు తున్నారు.

**ఆహారంపై అత్యధిక ఖర్చు**

అందునా చిన్న చిన్న గ్రామాల్లో 27శాతం, పెద్ద గ్రామాల్లో 19శాతం, చిన్న పట్టణాల్లో 17శాతం, పెద్ద నగరల్లో 6శాతం మంది పేదరికంలో కూరుకుపోయి ఉన్నారు. ఎస్టీల్లో 43శాతంమంది, ఎస్సీల్లో 29శాతం మంది, ఓబీసీల్లో 21శాతంమంది, ఇతర కులాల్లో 12 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు. పేదలు తమ ఆదాయంలో 56శాతం ఆహారంపై ఖర్చుచేస్తున్నారు. గ్రామీణ పేదల్లో అత్యధికులు దినసరి కూలీ చేసుకొని జీనిస్తున్నారు. వ్యవసాయేతర రంగంలో 17శతం మంది, వ్యవసాయ దినసరి కూలీలుగా 34శాతంమంది ఉన్నారు. స్థిరమైన స్వల్పమొత్తంలో నెలఆదాయం కలిగిన పేదలు కేవలం 4శాతం మాత్రమే. అదే అర్బన్ ప్రాంతాల్లో పేదలు చిన్న చిన్న వృత్తులు చేసుకుంటూ పొట్ట నింపుకుంటున్నారు.అలాగే వ్యవసాయేతర పనుల్లో కూలీలుగా మారుతున్నారు.

- బోస్



## పేదరికంపై ఉక్కుపాదం

**2030 నాటికి పేదలు లేని చైనా : జిన్‌పింగ్**

ప్రపంచ దేశాల్లో పేదరికం, అసమానతలు పెరిగిపోతున్న తరుణంలో చైనాలో మాత్రం వృద్ధిరేటుతో పెరగడంతోపాటు, అసమానతలను తగ్గిస్తూ పేదరిక నిర్మూలనతో ముందుకు దూసుకుపోతోంది. 1970లో చైనాలో మార్కెట్ సంస్కరణలు చేపట్టిన తర్వాత పేదరికం గణనీయంగా తగ్గుతోంది. ఇప్పటివరకు 800 బిలియన్ల మంది పేదరికం నుంచి బయటపడేశారు. 1978లో అప్పటి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మూసవాదానికి చరమగీతం పాడి దేశంలో వ్యవసాయానికి పెద్దపీట వేశారు. కుటుంబ వ్యవసాయానికి ప్రాధాన్యత ఇచ్చి దేశంలోని గ్రామీణ అభివృద్ధికి పాటుపడ్డారు. అదే సమయంలో పారిశ్రమలను నెలకొల్పడంతోపాటు, నగరీకరణను చేపట్టి యువతకు ఉపాధి కల్పించారు. 2004 వరకు చైనాలో కార్మికుల వేతనం అత్యంత తక్కువగా ఉండేది. అయితే కార్మికుల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ద్వారా వారి స్థితిగతులను మార్చివేశారు. 1980లో చైనా అనేక డ్యాంలు, వ్యవసాయ ప్రాజెక్టులు నిర్మించారు. అదే సమయంలో గ్రామీణ ప్రాంతాలకు కూడా జాతీయ రహదారులను నిర్మించారు. 1994 నుంచి 2000 వరకు రోజుకు 1,200 కిలో మీటర్ల చొప్పున ఏడాదిలో 42 వేల కిలోమీటర్ల రహదారిని నిర్మించారు. (మన దేశంలో రోజుకు 20కిమీ నిర్మిస్తున్నారు). చైనా ఈ రహదారులను పనికి ఆహారం పథకంలో నిర్మించింది. దారిద్ర్యంలో మగ్గుతున్న కార్మికులకు వయోజన విద్య ద్వారాత ప్రాథమిక స్థాయి విద్య అందించి, వారిలో నైపుణ్యాలు పెంచేవిధంగా చర్యలు చేపట్టారు. 1980లో విదేశీ పెట్టుబడులను ఆహ్వానించిన చైనా అతికీలకమైన వనరులు, శాఖలను మాత్రం ప్రభుత్వం వద్దే ఉంచుకొని మిగతావాటిల్లో పెట్టుబడులను లాభదాయకంగా మరల్చుకుంది. దీంతో 1980కి వచ్చేసరికి ప్రతివ్యక్తి పర్సనల్ కంప్యూటర్, వాక్‌మెన్స్, మొబైల్‌ఫోన్లను అంది పుచ్చుకున్నారు. 1980నుంచి 90 వరకు విపరీతమైన ఎగుమతుల ద్వారా చైనా దాని ఆర్థిక వ్యవస్థను మెరుగు పరుచుకుంది. 1992 నుంచి 2005 వరకు వ్యవసాయ, సాఫ్ట్, ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్‌లో పట్టు సాధించి 2001లో వరల్డ్‌ట్రేడ్ ఆర్గనైజేషన్‌లోకి కాలు మోపింది. 2015 నాటికి చైనా ఎగుమతులు 13.5 శాతానికి పెరిగాయి. ఒకప్పుడు ఇంతస్థాయి అమెరికాకు మాత్రమే ఉండేది. వికేంద్రీకరణ, ప్రయోగాత్మక ప్రణాళికలు, క్షేత్రస్థాయి నుంచి పథకాల అమలుతో ఈ విజయాన్ని చైనా సొంతం చేసుకుంది. చిన్న స్థాయిలో కూడా అత్యంత ఆధునీకమైన యంత్రాలను వాడటం ద్వారా ఉత్పత్తిని గణనీయంగా పెంచుకుని దారిద్ర్యాన్ని నిర్మూలించగలుగుతోంది. ఇప్పటికీ ఇంకా ఆదేశంలో 40 కోట్ల మంది దారిద్ర్యంలో మగ్గుతున్నారు. అయితే చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ 2020 నాటికి దేశం నుంచి దారిద్ర్యాన్ని తరిమేస్తామని హామీ ఇస్తున్నారు. హామీల్లో భాగంగా రోజుకు 50 వేల మందికి ఉపాధికల్పిస్తున్నారు. అదే సమయంలో మన దేశంలో పెద్దనోట్లరద్దు, జీఎస్టీ ద్వారా సుమరు లక్షవరకు చిన్న మధ్యతరహా పరిశ్రమలు మూతపడ్డాయి. మనదేశంలో నైపుణ్యాభివృద్ధి కోసం రూపొం దించిన పథకాలన్నీ ప్రకటనలకే పరిమి తమవుతాయి. దేశ నాయకుల్లో చిత్తశుద్ధి లోపించడంతోపాటు, పెద్దపెద్ద ప్రాజెక్టులన్నీ కాంట్రాక్టర్ల చేతిలో కెళ్లి కుటుంబ పరంగా లాభాలు పొందుతారుగాని, సమాజానికి ఉపయోగం ఉండకపోగా నానాటికి పేదవారు పరిస్థితి దారుణంగా మారడంతోపాటు, దేశంలో సమాన అవకాశాలు అందక అసమానతలు పెరుగుతున్నాయి.అదే సమయంలో చైనాలో అవినీతికి పాల్పడినట్లు తెలిస్తే బహిరంగంగా కాల్చి చంపుతారు. ఇలాంటి వ్యవస్థ మనకు లేకపోవడం వల్ల దేశంలో అంతరాలు పెరుగుతూ భవిష్యత్తు ఆందోళన కలిగిస్తోంది.



**చైనాలో అవినీతికి పాల్పడిన 26 మంది రాజకీయ నేతలను ఇలా ఒక్కసారే ఒక్కబుల్లెట్ మెడవెనుక నుంచి కాల్చి చంపారు. ఈ బుల్లెట్ ఖర్చును కూడా బంధువుల నుంచి వసూలు చేశారు.**

# మొహరంతో ఇస్లాం నూతన సంవత్సరం

మొహర్రం మాసం ఆరంభం రోజున ఇస్లామ్ నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. ఇది అరబ్బీ కేలండర్ మొదటి నెల. పూర్వకాలంలో అరబ్బులు (అరేబియాలోని యూదులు, క్రైస్తవులతో సహా) ఈ కేలండర్‌నే ఉపయోగించేవారు. ఆషూరా దినం, అనగా మొహరం ఒకటవతేదీని, అనేక సాంప్రదాయక గుర్తులకు అనుగుణంగా పండుగగా జరుపుకునేవారు. పద్నాలుగు శతాబ్దాల క్రితమే ప్రజాస్వామ్యం కోసం, మానవ హక్కుల కోసం జరిగిన చరిత్రాత్మక పోరాటం 'మొహరం' ఈ పేరు వినగానే పీర్లు, నిప్పులగుండాలు, గుండెలు బాదుకుంటూ 'మాతిం' చదవటాలు గుర్తుకొస్తాయి. మొహర్రం జరిగే పది రోజులు విషాద దినాలే కాని, ఎంత మాత్రం సంతోష దినాలు కాదు.

క్రీ.శ 632 మహమ్మద్ ప్రవక్త (స)పరమపదించారు. ప్రజలు ప్రజాస్వామ్య రీతిలో తమ ప్రతినిధుల్ని ఖలీఫాలను ఎన్నుకోవాలి. హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్, హజ్రత్ ఉమర్, హజ్రత్ ఉస్మాన్, హజ్రత్ అలీ ఈ విధంగా ఎన్నికైన ఖలీఫాలే. ఇమామ్ హసన్, ఇమామ్ హుస్సేన్- ఇరువురు దైవ ప్రవక్త మహమ్మద్(స) మనవళ్లు. హజ్రత్ అలీ తనయులు. హజ్రత్ అలీ తరువాత ప్రజలు ఇమామ్ హసన్‌ను ప్రతినిధిగా ఎన్నుకొన్నారు.



అప్పుడు సిరియా ప్రాంత గవర్నర్ మావియాలో అధికార దాహం పెరిగింది. కత్తితో రాజ్యాన్ని హస్తగతం చేసుకోవాలని కుట్ర పన్నాడు. యుద్ధం ప్రకటించి ఇమామ్ హసన్‌ను గద్దెదించాలనుకొన్నాడు. యుద్ధంలో పాల్గొంటే అమాయక సోదర ప్రజలు ప్రాణాలు కోల్పోతారనే బాధాతప్త హృదయంతో యుద్ధనివారణ కోసం ఇమామ్ హసన్ ప్రజలు తనకు కట్టబెట్టిన పదవిని త్యజించారు. మావియా కుట్ర ఫలించింది. అయితే కొద్ది రోజుల వ్యవధిలోనే హసన్ విషప్రయోగానికి గురై హతులయ్యారు. నిరంకుశంగా మావియా తన కుమారుడు యజీద్‌ను రాజ్యాధికారిగా నియమించారు. ఇస్లామీయా ధర్మశాస్త్రాన్ని నుసరించి సంప్రతింపులే సమస్యల విమోచనకు మార్గాలు. చర్చలకోసం ఇమామ్ హుస్సేన్ రాజధాని కుఫాకు బయల్దేరారు. యజీద్‌కు విజయం తెలిసింది. పాషాణ హృదయుడైన అతడు ఇమామ్ హుస్సేన్‌ను మార్గం మధ్యలో అడ్డుకొని లొంగదీ సుకోవడానికి సైన్యాన్ని పంపాడు. ఇమామ్ పరివారాన్ని కర్బలా అనే చోట అడ్డగించి యజీద్‌ను రాజుగా అంగీకరించమని సైన్యాధిపతి హెచ్చరించాడు లేదా యుద్ధానికి సిద్ధపడమన్నాడు. మిత్రులు, కుటుంబసభ్యులు, స్త్రీలు, పిల్లలు కలసి మొత్తం 72 మంది ఇమామ్ హుస్సేన్ వెంట ఉన్నారు. పది రోజులు యుద్ధం జరిగింది. ఇమామ్ హుస్సేన్ పరివారం స్వల్పమైనా వీరోచితంగా పోరాడి అశువులు బాసింది. పదోరోజు హుస్సేన్ ఒక్కరే మిగిలారు. శుక్రవారం మధ్యాహ్నం నమాజ్ కోసం శత్రువునడిగి కొన్ని నిమిషాలు అనుమతి పొందారు. ప్రార్థనలో నిమగ్నమైన తర్వాత శత్రువులు భీరులై ఇమామ్ హుస్సేన్‌ను వెన్నుపోటు పొడిచి సంహరించారు. దీంతో మొహర్రం పది రోజులు విషాద దినాలుగా మారాయి. తెలుగు ప్రాతాంల్లో మరీ ముఖ్యంగా నిజాం పాలిత ప్రాంతాల్లో మొహరం పండుగను ముస్లిములే కాక అన్ని వర్గాల ప్రజలూ జరుపుకోవడం వందలాది ఏళ్ళుగా సాగుతోంది. యాత్రాచరిత్రకారుడు ఏనుగుల వీరాస్వామయ్య జూన్ 29, 1830న నిజాం పాలిత ప్రాంతాల్లో ప్రారంభమైన మొహరం పండుగను తాను రచించిన కాశీయాత్ర చరిత్రలో అభివర్ణించారు. ఆయన హైదరాబాద్ ప్రాంతంలో జరిగిన మొహర్రం పండుగ వైభవాన్ని ఇలా వర్ణించారు: షహరు (హైదరాబాదు)కు కంచికి గరుడసేవ ముఖ్యమైనట్టుగా ఆ మొహరం పండుగ ప్రబలమైన ఉత్సవము. ఆ ఉత్సవ కాలములో పరమాత్మని చైతన్యము ఆ షహరులో ఎక్కువగా ప్రకాశించుటచేత అనేక వేలమంది ఇతర మతస్థులుగా కూడా షహరుకువచ్చి ఆ తొమ్మిదో రోజు మొదటి నుంచి ఆఖరువరకు పాల్గొన్నారని ఆయన రాశారు.

- ఖాన్

## అంజుమన్ ఇస్లామియాకు నూతన కార్యవర్గం


**అధ్యక్షుడిగా లాయర్ మొయినుద్దీన్**



**రాజధాని వార్తలు, గుంటూరు :** నగర అంజుమన్ ఇస్లామియాకు నూతన కార్యవర్గాన్ని నియమిస్తూ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా న్యాయవాది మొయినుద్దీన్, షేక్ అల్తాఫ్, కోశాదికారిగా ఎస్ఎం నిజాముద్దీన్, సభ్యులుగా యూసుఫ్, షేక్ మహమూద్, ఇబ్రహీం ఖలీలుల్లా, అబ్దుల ఖాదిర్, ఎంఏ ముజహర్‌బేగ్, మహమ్మద్ రఫి, అబ్దుల్ గపూర్-షేక్ అఫ్జల్ నియమితులయ్యారు. ఈ మేరకు లాలాపేటలోని ఆ సంస్థ కార్యాలయంలో వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ హైదర్‌బాషా చేతుల మీదుగా నూతన కార్యవర్గం నాయకులు నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష ప్రదాన కార్యదర్శులు మొయినుద్దీన్, అల్తాఫ్‌లు మాట్లాడుతూ అంజుమన్ ఇస్లామియా ఆశయాలతో పాటు పేద ముస్లిం వర్గాల అభ్యున్నతికి మరింత కృషి చేస్తామని పేర్కొన్నారు.

## సైమా అవార్డ్స్ 2018

**ఉత్తమ నటుడు ప్రభాస్, ఉత్తమ దర్శకుడు రాజమౌళి...**





సౌతిండియా ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్(సైమా) అవార్డుల వేడుక ఈనెల 14,15 తేదీల్లో దుబాయిలో అంగరంగ వైభ వంగా జరిగాయి. దక్షిణ భారత సినీ పరిశ్రమలకు చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడానికి చెందిన సినిమా పరిశ్రమలకు సంబంధించిన అవార్డులను ఈ వేడుకలో ప్రకటించారు. తొలి రోజు తెలుగు కేటగిరీకి సంబంధించిన అవార్డుల ప్రధానోత్సవం జరిగింది. ఈ ఏడాది బెస్ట్ ఫిల్మ్ అవార్డ్ బాహుబలి 2-ది కంక్లూజన్ దక్కించుకుంది. దీంతో పాటు ప్రభాస్, రాజమౌళి, బాలయ్య తదితరులకు అవార్డులు దక్కాయి. ఉత్తమ నటుడు ప్రభాస్ ఉత్తమ చిత్రం: బాహుబలి 2- ది కంక్లూజన్ ఉత్తమ చిత్రం క్రిటిక్స్ కేటగిరీలో ఉత్తమ నటుడు బాలయ్య ఉత్తమ నటుడు (గౌతమీపుత్ర శాతకర్ణి) ఉత్తమ విలన్‌గా రానా దగ్గుబాటి (బాహుబలి 2, ) ఉత్తమ నటి: కాజల్ (నేనే రాజు నేనే మంత్రి) లు అవార్డులు పొందాయి.

## ముదిరాజ్‌లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**రాజధాని వార్తలు, నందిగామ :** అవిభాజిత ఆంధ్రప్రదేశ్‌లో ముదిరాజ్ కులస్తులకు ఎంతో ప్రాధాన్యత ఉండేది. కేవలం కొంత మంది ఆర్థికంగా బలవంతులు కావటంతో ముదిరాజ్ కులం బి.సి.డి.గా నిర్ణయించబడింది. నవ్యాంధ్రప్రదేశ్ లో తమకు ఆర్థికంగా, పారిశ్రామికంగా ఎదుగుదలలేదని ముదిరాజ్ సమాజ నాయకులు దోనేపల్లి చిన్న నాగేశ్వరరావు ఆరోపించారు. దాదాపు 95% ముదిరాజ్ కులస్తులు దారిద్రరేఖకు దిగువున ఉన్నారని, ఇందులో దాదాపు 80% మంది తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి ఇప్పటి వరకు ఉన్నప్పటికి పార్టీ తమను పట్టించుకోవటం లేదన్నారు. రాష్ట్రంలోని 100 నియోజక వర్గాలలో ఒక్కోక్కో నియోజవర్గంలో 15 వేల ఓటర్లు తమవి ఉన్నాయని, తాము అభివృద్ధి చెందటానికి ప్రోత్సహించాలని ఆయన కోరారు. తమకు మిగతా వారిలాగానే ప్రత్యేక ఆర్థిక కార్పోరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఆయన తెలిపారు. తమ ప్రాతినిద్యం ఎక్కువ ఉన్న నియోజకవర్గాల్లో నామినేటెడ్ పదవులు ఇచ్చి సామాజికంగా, ఆర్థికంగా ఎదుగుదలకు తోడ్పాటు అందించాలని ముదిరాజులకు ప్రాతినిద్యం వహిస్తున్న చిన్న నాగేశ్వరరావు తెలిపారు.




**చిన్న నాగేశ్వరరావు**

## ఘనంగా ఉభయ రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు

**రాజధాని వార్తలు విజయవాడ :** సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు సారద్యంలో యువ కళావాహిని ఆధ్వర్యంలో ఘంటసాల వెంకటేశ్వర రావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల, విజయవాడలో సెప్టెంబర్ 10.11.12. తేదీలలో ప్రతిరోజు సాయంత్రం 6.00 గంటలకు డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్ నిర్వహించిన 24వ ఉభయ రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు-2018 జరిగాయి. ఉత్తమ ప్రదర్శనగా అరవింద ఆర్ట్స్, లాడేపల్లి వారి 'మధుపర్కాలు' ద్వితీయ ప్రదర్శనగా గంగోత్రి పెదకాకాని వారి పచ్చ చందురుడు, ఉత్తమ రచయితగా వల్లూరు శివ ప్రసాద్ (మధుపర్కాలు). ఉత్తమ దర్శకత్వం గంగోత్రి సాయి (మదుపర్కాలు), ఉత్తమ సాంకేతిక నిర్వహణ విభాగంలో రంగాలంకరణకు (మధుపర్కాలు), ఉత్తమ నటుడుగా వై.ఎస్. కృష్ణీశ్వరరావు (గుర్తు తెలియని శవం), ఉత్తమ విలన్ పాత్రదాజ్ నటిగా గుడివాడ లహరి (బతుకు చిత్రం), క్యారెక్టర్ ఆర్టిస్టుగా బి. ఉదయ బాస్కర్ (గుర్తు తెలియని శవం) ఉత్తమ విలన్ పాత్రదారిగా ఏపూరి హరిబాబు (భూమి దు:ఖం) బహుమతులు గెలుచుకున్నారు. జ్యూరీ ప్రదర్శనకి బహుమతి జనశ్రేణి, విజయవాడ వారి 'గుర్తు తెలియని శవం' ఎంపికైంది.

10వ తేదీన డాక్టర్ అక్కినేని జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రముఖ నటి శ్రీమతి గీతాంజలి ముఖ్య అతిధి, ఆంధ్రప్రదేశ్ పూర్వ ముఖ్యమంత్రి తమిళనాడు పూర్వ గవర్నర్ కొణిజేటి రోశయ్య చేతుల మీదుగా, 12వ తేదీన డాక్టర్ అక్కినేని పరిషత్ రంగస్థల పురస్కారాన్ని ప్రముఖ నటుడు ఉత్తేజ్ ఆంధ్రప్రదేశ్ విధాన సభ ఉప సభాపతి డాక్టర్ మండలి బుద్ధప్రసాద్, సారిపల్లి కొండలరావు చేతుల మీదుగా అందుకున్నారు. ఆ రోజు జరిగిన సభకు గౌరవ అతిధిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాష సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ విజయ బాస్కర్, డి.ఎస్. దీక్షిత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సారిపల్లి కొండలరావు ఫాండేషన్ 10 మంది వృద్ధ కళాకారులకు ఆంధ్రప్రదేశ్ జానపద- రంగస్థల కళల నగదు పురస్కారాల ప్రధానం జరిగింది. విజయవాడ వాసులకు, చుట్టుపక్కల వారికి కన్నుల పండువగా జరిగిన ఈ కార్యక్రమానికి యువకళావాహిని అధ్యక్షుడు లయన్ వై కె నాగేశ్వరరావు కన్వీనర్‌గా, జి. మల్లికార్జున రావు, బొప్పన నరసింహ రావు, భాగి శాస్త్రి, ఎం.ఏ హమీద్, జీవీజీ శంకర్, ఎన్. వీ. ఎస్ మూర్తి, శ్రీధర్, కె.ఎన్ రావు, పి. ఉమారాణి తమ వంతు సహకారాన్ని అందించారు. కార్యక్రమాల వ్యాఖ్యాతగా కళావాచస్పతి డాక్టర్ లంక లక్ష్మినారాయణ వ్యవహరించారు.



**ప్రజ్ఞ**

ఈ ప్రదర్శనల సందర్భంగా 12వ తేదీన నరసరావుపేట వాస్తవ్యురాలు, ఆలపాటి రాంబాబు, శ్రీమతి జ్యోతి కుమార్తె, కుమారి ప్రజ్ఞ ప్రదర్శించిన 'మహిషాసుర మర్దని' కూచిపూడి నృత్యం ప్రేక్షకులని విశేషంగా అలరిఒంచింది. కుమారి ప్రజ్ఞ తన మూడు సంవత్సరాల వయసు నుండే కూచిపూడి నాట్యం నేర్చుకోవడం మొదలు పెట్టింది. తన నాలుగవ సంవత్సరం నుండే నృత్య ప్రదర్శనలు ఇవ్వడం మొదలు పెట్టింది. కూచిపూడి నృత్యంలో డిప్లొమా కోర్సు, సర్టిఫికెట్ కోర్సు పాస్ అయి, ప్రస్తుతం బిఏ మొదటి సంవత్సరం చదువుతోంది. అమెరికా సిలికాన్ ఆంధ్ర వారితో కలిసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ వారు వరుసగా హైదరాబాద్ గచ్చిబౌలిలో 2010, 2012, 2014 సంవత్సరాలలో, విజయవాడలో 2016 లో నిర్వహించిన మహా బృంద నాట్యం లో పాల్గొంది. కుమారి ప్రజ్ఞ 2016లో తెనాలి కళాకారుల సంఘం నుండి ప్రతిభా పురస్కారాన్ని, కళానిలయం, చిలకలూరిపేట నుండి వరుసగా 2015, 2018 సంవత్సరాలలో నవరస భారత నాట్య మయూరి, భారతీయ నాట్య మయూరి, నాట్య విజ్ఞాన్ గత జూలై నెలలో ఆంధ్రపదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ నుండి తెనాలిలో గుర్రం జాషువా 47వ వర్ధంతి సందర్భంగా 'నృత్య చంద్రిక' అవార్డులతో సత్కరించబడింది. ఈ నెల 8వ తేదీన ప్రఖ్య చిల్డ్రన్స్ ఆర్ట్స్ థియేటర్, తెనాలి వారిచే నిర్వహించబడిన కార్యక్రమంలో నాగిని నృత్యం ప్రదర్శించి ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో, ప్రేక్షకుల కోరికపై అదే నాగిని నృత్యాన్ని కొన్ని నిముషాల వ్యవధిలో రెండవసారి ప్రదర్శించి 'కృష్ణశ్రీ' యువ పురస్కారం పొందింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే కాకుండా, ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాలో, నాందేడ్-మహారాష్ట్రంలో, ఇప్పటి వరకు దాదాపు 500కుపైగా తన అద్భుత నృత్య ప్రదర్శనలతో ఆహుతులను అలరించడమే కాకుండా ఇటీవల గుమ్మడి ప్రేమ్ చంద్ దర్శకత్వంలో దివ్యాస్ లవ్ స్టోరీ అనే లఘు చిత్రంలో కూడా తొలిసారిగా నటించింది. ప్రజ్ఞను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, విద్యార్థులకు నృత్యం నేర్పడానికి నరసరావుపేట మండలంలో కోటప్పకొండ, ఉలవపాడు, శంకర భారతీపురం, దేచవరం, నేకరికల్లు గ్రామాలలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూళ్లలో నృత్య ఉపాధ్యాయురాలిగా నియమించింది. అదికాక ప్రజ్ఞ సొంతంగా లీలా వేంకటేశ్వర స్వామి దేవస్థానంచ నరసరావుపేటలో శ్రీ నర్తనశాల డాన్స్ అకాడమీ నడుపుతోంది.

- ఖాన్

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2016-18, Cell 9440662699, Email : rajadhanivartalu1@gmail.com